# నేడు నర్సాపూర్‌లో జాబ్ మేళా

**నర్సాపూర్, జూన్ 28, ప్రభాతవార్త:**
నర్సాపూర్ నియోజకవర్గంలో చదువుకొని నిరుద్యోగులుగా ఉన్న యువతీయువకుల కోసం నేడు 29 న ఆదివారం కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్చార్జ్ ఆవుల రాజిరెడ్డి ఆధ్వర్యంలో జాబ్ మేళా నిర్వహిస్తున్నట్లు కాంగ్రెస్ పార్టీ జిల్లా మాజీ జనరల్ సెక్రెటరీ మరాఠీ రామాగౌడ్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నర్సాపూర్ సమీపంలోని సాయికృష్ణ గార్డెన్లో నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ జాబ్ మేళాలో 60 కంపెనీలలో 1000 పోస్టులు ఖాళీగా ఉన్నాయన్నారు. ఈ మేరకు 60 వివిధ కంపెనీలో ఖాళీగా ఉన్న 1000 పోస్టులను భర్తీ చేయడానికి ఈ జాబ్ మేళాలో యువతీ యువకులను సెలెక్ట్ చేయనున్నారని తెలిపారు. ఈ మేరకు నర్సాపూర్ నియోజకవర్గ పరిధిలోని నిరుద్యోగులైన యువతీయువకులు తమ ఒరిజినల్ సర్టిఫికెట్లతో జాబ్ మేళాకు హాజరై ఇంటర్వ్యూలో పాల్గొని ఉద్యోగాలు పొందాలన్నారు. ఈ అవకాశాన్ని నిరుద్యోగులు అందరూ సద్వినియోగం చేసుకోవాలని రామాగౌడ్ తెలిపారు.



# మెదక్ | సంగారెడ్డి | సిద్దిపేట
# వార్త

# ప్లాస్టిక్ వినియోగిస్తున్న వైన్స్ షాపులకు జరిమానాలు

**నర్సాపూర్, జూన్ 28, ప్రభాతవార్త:**
నర్సాపూర్ పట్టణంలోని వైన్ షాప్‌లలో ప్లాస్టిక్‌ను వినియోగిస్తున్న నేపథ్యంలో జరిమానాలు విధించారు. ఈమేరకు మున్సిపల్ పరిధిలో శనివారం పర్యటించిన జిల్లా కలెక్టర్ రాహుల్‌రాజ్ పట్టణంలోని వైన్స్ షాప్‌లను పరిశీలించారు. ఈసందర్భంగా వైన్ షాప్‌లలో ప్లాస్టిక్ వాడుతూ అపరిశుభ్రంగా ఉన్నాయని ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్లాస్టిక్ వినియోగిస్తున్న నాలుగు వైన్ షాపులకు 5000 వేల రూపాయిల చొప్పున జరిమానా విధించాలని జిల్లా కలెక్టర్ ఆదేశించారు. ఈ మేరకు నర్సాపూర్ మున్సిపల్ కమిషనర్ శ్రీరామ్‌చరణ్‌రెడ్డి ఆధ్వర్యంలో మున్సిపల్ సిబ్బంది వైన్ షాప్‌లోకి వెళ్లి ఒక్కో వైన్ షాప్‌కు రూ.5000 చొప్పున వైన్స్‌షాపులకు రూ.20వేల జరిమానా విధించారు. ఈసందర్భంగా మున్సిపల్ కమిషనర్ శ్రీరామ్‌చరణ్‌రెడ్డి మాట్లాడుతూ నర్సాపూర్‌లో దుకాణదారులు కాని, ఎవరైనా కాని ప్లాస్టిక్‌ను వినియోగిస్తే జరిమానాలు విధిస్తామని ఆయన హెచ్చరించారు. ఈసమయంలో మున్సిపల్ కమిషనర్ శ్రీరామ్‌చరణ్‌రెడ్డితో పాటు మునిసిపల్ సిబ్బంది తదితరులు ఉన్నారు.

## మంత్రిని కలిసిన కాటా శ్రీనివాస్‌గౌడ్



మంత్రి దామోదర్ రాజనర్సింహతో చర్చిస్తున్న కాటా శ్రీనివాస్‌గౌడ్

**అమీన్‌పూర్, జూన్ 28, ప్రభాతవార్త:**
తెలంగాణ సచివాలయంలో పటాన్‌చెరు నియోజకవర్గానికి సంబంధించిన అభివృద్ధి పనులపై చర్చించేందుకు కాంగ్రెస్ పార్టీ పటాన్‌చెరు నియోజకవర్గ ఇంచార్జి కాట శ్రీనివాస్‌గౌడ్ శనివారం రోజు రాష్ట్ర వైద్య,ఆరోగ్యశాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహని మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా నియోజకవర్గంలోని పలు సమస్యలు, ఇతర అభివృద్ధి కార్యక్రమాలపై మంత్రితో చర్చించారు. మంత్రి సమస్యల పరిష్కారానికి అవసరమైన చర్యలు తీసుకుంటానని హామీ ఇచ్చారని కాట శ్రీనివాస్‌గౌడ్ తెలిపారు.

## మంత్రిని కలిసిన గుమ్మడిదల కాంగ్రెస్ నాయకులు



జిల్లా మంత్రిని సన్మానిస్తున్న కాంగ్రెస్ నాయకులు

**గుమ్మడిదల, జూన్ 28, ప్రభాతవార్త:**
గుమ్మడిదల మున్సిపాలిటీ మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు పుట్ట నర్సింగరావు ఆధ్వర్యంలో కార్మిక ఉపాధి శిక్షణ కర్మాగారాలు గనులు, భూగర్భశాఖ మంత్రివర్యులు చెన్నూరు శాసన సభ్యులు గడ్డం వివేకానందని శనివారం ఆయన నివాసంలో మర్యాదపూర్వకంగా కలిసి శాలువాతో సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు, జగ్గారెడ్డి కిరణ్‌కుమార్‌రెడ్డి, తుమ్మల సందీప్‌రెడ్డి, ముద్దుల రోహిత్, గ్యారాల మల్లేష్, నరసింహులుముదిరాజు తదితరులు పాల్గొన్నారు.

## కలెక్టర్‌ను కలుసుకున్న మున్సిపల్ కమిషనర్



కలెక్టర్ ప్రావీణ్యను కలిసిన మున్సిపల్ కమిషనర్ సుభాష్‌రావు

**జహీరాబాద్, జూన్ 28, ప్రభాతవార్త:**
జహీరాబాద్ మున్సిపల్ కమిషనర్‌గా బాధ్యతలు స్వీకరించిన డి.సుభాష్‌రావు శనివారం జిల్లా కలెక్టర్ ప్రావీణ్యను కలెక్టర్ కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలుసుకుని పూలబొకేను అందచేశారు. జహీరాబాద్ మున్సిపాలిటీకి సంబంధించి పలు వివరాలను కలెక్టర్ దృష్టికి తీసుకుపోయారు.

## ఓల్డ్ ఏజ్ హోమ్‌ను ఆకస్మిక తనిఖీ చేసిన న్యాయమూర్తి



విజన్ ఓల్డ్‌ఏజ్ హోమ్ వృద్ధులతో మాట్లాడుతున్న న్యాయమూర్తి ఎం.హేమలత

**నర్సాపూర్, జూన్ 28, ప్రభాతవార్త:**
నర్సాపూర్ పట్టణంలోని విజన్ ఓల్డ్‌ఏజ్ హోమ్‌ను మెదక్ జిల్లా న్యాయ సేవా అధికార సంస్థ ఆదేశాల మేరకు శనివారం జూనియర్ సివిల్ జడ్జ్ కం చైర్మన్ మండల్ లీగల్ సర్వీస్ కమిటీ నర్సాపూర్ న్యాయమూర్తి ఎం.హేమలత ఆకస్మిక తనిఖీ చేశారు. ఈ సందర్భంగా విజన్ ఓల్డ్‌ఏజ్ హోంలో ఉన్న వృద్ధులను ప్రత్యక్షంగా కలిసి వారి బాగోగులు అడిగి తెలుసుకున్నారు. ఏదైనా సమస్య ఉంటే మండల్ లీగల్ సర్వీస్ కమిటీ నర్సాపూర్‌ను ఆశ్రయించవచ్చునని తెలిపారు. ఈ మేరకు పలువురువృద్ధులు తమకు పింఛన్‌రావట్లేదని పింఛన్ మంజూరుచేయించమని న్యాయమూర్తిని కోరడం జరిగింది. వెంటనే న్యాయమూర్తి స్పందిస్తూ అర్హులైన వ్యక్తులకు సంబంధిత అధికారుల ద్వారా మాట్లాడి మండల్ లీగల్ సర్వీస్ కమిటీ నర్సాపూర్ ద్వారా పరిష్కరించేందుకు కృషి చేస్తామన్నారు. అదేవిధంగా వృద్ధులపట్ల ప్రేమ, అనురాగాలతో, మమకారంతో వారిని చూసుకోవాలని న్యాయమూర్తి అన్నారు. ఈ కార్యక్రమంలో లీగల్ సర్వీస్ న్యాయవాది సిహెచ్ స్వరూప రాణి, ఓల్డ్‌ఏజ్ హోమ్ ప్రతినిధి సుధాకర్‌రెడ్డి, సిబ్బంది సుజాత, శిరీష, రాజు లీగల్ సర్వీస్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## కలెక్టర్‌ను కలిసిన కార్పొరేటర్ సింధూ



హైద్రాబాద్ కలెక్టర్ హరిచందనకు పూలబొకేను అందచేస్తున్న కార్పొరేటర్ సింధూ

**రామచంద్రాపురం, జూన్ 28, ప్రభాతవార్త:**
హైద్రాబాద్ నగర్ కొత్త కలెక్టర్‌గా బాధ్యతలు స్వీకరించిన హరిచందనను శనివారం భారతీనగర్ డివిజన్ కార్పొరేటర్ వెన్నవరం సింధూ ఆదర్శ్‌రెడ్డి మర్యాద పూర్వకంగా కలుసుకుని పూలబొకేను అందించి హార్థిక స్వాగతం పలికారు. కలెక్టర్ హరిచందన గతంలో లింగంపల్లి జోనల్ కమిషనర్‌గా విధులు నిర్వహించిన తరుణంలో డివిజన్ అభివృద్ధికి అందించిన సేవలను ఈ సందర్భంగా సింధూ ఆదర్శ్‌రెడ్డి గుర్తు చేసుకున్నారు.

# జిల్లాలో వనమహోత్సవ ముందస్తు కార్యాచరణ చేపట్టాలి

**-ఎన్ఆర్ఈజిఎస్ పనులు వేగవంతం చేయాలి**
**-సీజనల్ వ్యాధులు సోకకుండా అప్రమత్తంగా ఉండాలి**
**-జిల్లా కలెక్టర్ హైమావతి**

**సిద్దిపేట, ప్రభాతవార్త ప్రతినిధి:**
జిల్లాలో వనమహోత్సవ ముందస్తు కార్యాచరణ, ఎన్ఆర్ఈజిఎస్ పనులువేగవంతం, గ్రామ పంచాయతీలలో సీజనల్ వ్యాధులు సోకకుండా అప్రమత్తంగా ఉండాలని జిల్లాకలెక్టర్ హైమావతి అధికారులను ఆదేశించారు. జిల్లా కలెక్టరేట్‌లో శనివారం జిల్లా గ్రామీణాభివృద్ధి, గ్రామ పంచాయతీ, పంచాయతీరాజ్‌శాఖల అధికారులతో నిర్వహించిన సమీక్షా సమావేశంలో ఆమె పాల్గొని మాట్లాడారు. వనమహోత్సవంలో భాగంగా ప్రతి మండలానికి ఇచ్చిన లక్ష్యాన్ని విధిగా పూర్తిచేయాలన్నారు. ఎన్ఆర్జిఎస్ ద్వారా గుర్తించిన వివిధ ప్రాంతాల్లో ఫిట్టింగ్, ప్లాంటింగ్ చేయాలన్నారు. ప్లాంటింగ్ చేయగానే టిజిఎఫ్ఎంఎస్ సైట్‌లో అప్లోడ్ చేయాలన్నారు. సంరక్షణ బాధ్యతలు తీసుకున్న ఏజెన్సీలు సకాలంలో ఫర్టిలైజర్, నీటిని అందిస్తే మొక్కలు పెరిగే అవకాశం ఉంటుందన్నారు. నాటిన ప్రతిమొక్కను చెట్టుగా ఎదిగేవరకు అధికారులు పర్యవేక్షణ చేయాలన్నారు. వేప, రావి, మర్రి, చింత, నేరేడు లాంటి మొక్కలు ఎక్కువగా నాటాలన్నారు. రైతులు ఈత, మునగ, మామిడి, జామ, సీతాఫలం, నారింజ, కొబ్బరితోటలు పెంచాలని అధికారులు రైతులతో గ్రామాల్లో సమావేశాలు నిర్వహించి ప్రోత్సహించాలన్నారు. ఎన్ఆర్ఈజిఎస్ కూలీల శాతం పెంచాలన్నారు. నిర్మాణంచేపట్టిన పనులు త్వరగా పూర్తి అయ్యేలా చూడాలన్నారు. గ్రామపంచాయతీలలో పన్ను వసూలు, మిషన్ భగీరథ తాగునీటిపైన దృష్టి కేంద్రీకరించాలన్నారు. పన్ను వసూలు వేగవంతం చేయాలన్నారు. ఓవర్‌హెడ్ ట్యాంకులు సకాలంలో విధిగా శుభ్రం చేయించాలన్నారు. నీటి శాంపిల్స్‌ను ల్యాబ్‌కు పంపించాలన్నారు. అనంతరం స్వచ్ఛ సర్వేక్షణ్ గ్రామీణ-2025 గోడపత్రికను జిల్లా కలెక్టర్ ఆవిష్కరించారు. కార్యక్రమంలో జడ్పి సిఈవో రమేష్, డిఆర్‌డిఎ పిడి జయదేవ్ ఆర్య, డిపివో దేవకీదేవి, పంచాయతీరాజ్ ఈఈలు శ్రీనివాస్‌రెడ్డి, చిరంజీవులు తదితరులు పాల్గొన్నారు.

**రాష్ట్రంలోనే జిల్లాను మొదటిస్థానంలో నిలపాలి..**
నిర్దేశించిన లక్ష్యాలను సాధించడానికి అధికారులు కృషిచేసి రాష్ట్రంలోనే జిల్లాను మొదటిస్థానంలో నిలపాలని జిల్లా కలెక్టర్ హైమావతి ఆదేశించారు. జిల్లా కలెక్టరేట్‌లో శనివారం వ్యవసాయ, ఉద్యాన, పశుసంవర్ధక, మత్స్యశాఖల అధికారులతో వారికి కేటాయించిన లక్ష్యాలపై ఆమె సమీక్షించి మాట్లాడారు. అన్నిశాఖల అధికారులు నిర్దేశించిన లక్ష్యాలను సకాలంలో పూర్తి చేయాలన్నారు. జిల్లాలో ఆయిల్‌ఫాం సాగుచేసేలా రైతులను ప్రోత్సహించడంతోపాటు అవగాహన సదస్సులు నిర్వహించాలని ఆదేశించారు. మండల స్థాయిలో పెండింగ్‌లో ఉన్న లక్ష్యాలను జూలై 15లోగా పూర్తిచేయాలని ఆదేశించారు. జిల్లాలో ఒకే తరహా పంటలు కాకుండా కోకో మొదలైన అంతర్ పంటలు సాగుచేసేలా చూడాలన్నారు. వ్యవసాయంతోపాటు వ్యవసాయ అనుబంధ రంగాలలో రైతులను ప్రోత్సాహించాలన్నారు. కార్యక్రమంలో ఉద్యానదర్శిని అనే పుస్తకాన్ని కలెక్టర్ చేతులమీదుగా ఆవిష్కరించారు. కార్యక్రమంలో జిల్లా అదనపుకలెక్టర్ గరిమా అగ్రవాల్, వ్యవసాయశాఖ అధికారి రాధిక, ఉద్యానవనశాఖ అధికారి సువర్ణ, మత్స్యశాఖాధికారి మల్లేశం, పశుసంవర్ధకశాఖ అధికారి కొండల్‌రెడ్డి పాల్గొన్నారు.



సమీక్షాసమావేశంలో మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్ హైమావతి

# తాగునీటి సమస్య తలెత్తకుండా చర్యలు తీసుకోవాలి

**-జిల్లా కలెక్టర్ పి.ప్రావీణ్య**
**-తాగునీటి సరఫరాపై అధికారులతో కలెక్టర్ సమీక్ష**



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ ప్రావీణ్య

**సంగారెడ్డి బ్యూరో, జూన్ 28, ప్రభాతవార్త:**
జిల్లాలో తాగునీటి సమస్యలు లేకుండా, అన్ని ఆవాస ప్రాంతాలకు తాగునీరు సరఫరా అయ్యేలా అధికారులు చర్యలు చేపట్టాలని జిల్లా కలెక్టర్ పి.ప్రావీణ్య అధికారులకు సూచించారు. శనివారం కలెక్టర్ క్యాంపు కార్యాలయంలో జిల్లాలోని మంజీరా బ్యారేజీ, సింగూర్ ప్రాజెక్టు నుండి హైదరాబాద్ మెట్రో వాటర్ వర్క్స్‌కు సరఫరా అవుతున్న తాగునీటి వివరాలను, మంజీరా బ్యారేజ్ పరిస్థితి, నారింజ వాగు, సింగూర్ పరీవాహక ప్రాంతం, వివరాలు, నూతనంగా చేపట్టిన చెరువుల, కుంటల నిర్మాణం పనుల పురోగతి, తాగునీటి సరఫరాలపై నీటిపారుదల శాఖ, మిషన్ భగీరథ, పబ్లిక్ హెల్త్, మున్సిపల్, అధికారులతో జిల్లా కలెక్టర్ పి.ప్రావీణ్య సమీక్ష నిర్వహించారు. ఈసందర్భంగా జిల్లా కలెక్టర్ పి.ప్రావీణ్య మాట్లాడుతూ, జిల్లాలోని ఝరాసంఘం, న్యాల్‌కల్ మండలాలలో అసంపూర్తిగా ఉన్న మిషన్ భగీరథ పనులు వెంటనే పూర్తి అయ్యేలా అధికారులు చర్యలు చేపట్టాలని సూచించారు. జిల్లాలోని అన్ని గురుకుల సంక్షేమ పాఠశాలలో వసతి గృహాలు అంగన్వాడీ కేంద్రాలకు తాగునీరు సరఫరా, మంచినీటి కనెక్షన్లు ఏర్పాటు చేయాలని మిషన్ భగీరథ, ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులను కలెక్టర్ ఆదేశించారు. వర్షాకాలాన్ని దృష్టిలో పెట్టుకొని లీకేజీలకు అవసరమైన మరమ్మతు పనులు వెంటనే చేపట్టాలని అధికారులకు సూచించారు. ప్రతి శుక్రవారం ఫ్రైడే డ్రైడే కార్యక్రమాన్ని చేపట్టాలని, మురుగునీరు నిలువ ఉండకుండా చర్యలు తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ చంద్రశేఖర్, మిషన్ భగీరథ డిఈ రఘువీర్, ఎఎ పాషా, ఈఈ పబ్లిక్ హెల్త్ కృష్ణమోహన్, నీటి పారుదలశాఖ అధికారులు, మున్సిపల్ ఇంజనీర్ అధికారులు, సంబంధిత శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# నర్సాపూర్‌ను ప్లాస్టిక్‌రహిత మున్సిపాలిటీగా తీర్చిదిద్దాలి

**-ఎవరైనా ప్లాస్టిక్ వాడితే జరిమానాలు**
**-సీజనల్ వ్యాధుల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలి**
**-మెదక్ జిల్లా కలెక్టర్ రాహుల్‌రాజ్**



వార్డులలో పర్యటిస్తున్న కలెక్టర్ రాహుల్‌రాజ్‌తోపాటు మున్సిపల్ కమిషనర్ శ్రీరామ్‌చరణ్‌రెడ్డి

**నర్సాపూర్, జూన్ 28, ప్రభాతవార్త:**
స్వచ్ఛ నర్సాపూర్ మున్సిపల్ కోసం ప్రజలందరూ భాగస్వాములై ప్లాస్టిక్‌రహిత మున్సిపాలిటీగా నర్సాపూర్ మున్సిపాలిటీ తీర్చిదిద్దాలని మెదక్ జిల్లాకలెక్టర్ రాహుల్‌రాజ్ అన్నారు. శనివారం ఉదయం నర్సాపూర్ మున్సిపల్ పరిధిలోని అన్ని వార్డులలో జిల్లా కలెక్టర్ రాహుల్‌రాజ్ సుడిగాలి పర్యటన చేశారు. ఈ సందర్భంగా ఆయన వార్డులోని పారిశుధ్యాన్ని, ఇందిరమ్మ ఇళ్లను, తాగునీటి సమస్యను రోడ్ల పరిస్థితులను మురికి కాల్వల నిర్మాణ పనులను పరిశీలించారు. వార్డుల్లో ఏయే సమస్యలు ఉన్నాయో వార్డుల ప్రజలను ఆయన అడిగి తెలుసుకున్నారు. వార్డుల్లో ఎప్పటికప్పుడు పరిశుభ్రంగా ఉంచాలని మున్సిపల్ అంశాలను పరిగణనలోకి తీసుకొని శానిటేషన్ సిబ్బందికి మున్సిపల్ అధికారులకు పట్టణ ప్రజలకు పలు సూచనలు సలహాలను ఇచ్చారు. ఈసందర్భంగా జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్ మాట్లాడుతూ వర్షాకాలం ప్రారంభమైనందున సీజనల్ వ్యాధులు రాకుండా పరిసరాలను ఎప్పటికప్పుడు పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. ఇందుకు మున్సిపల్ సిబ్బందికి ప్రజలు సహకరించాలన్నారు. తడి చెత్త, పొడి చెత్తను వేరు చేసి ఇంటింటికీ వచ్చే చెత్తబండికి చెత్తను వేయాలన్నారు. ఖాళీ స్థలాల్లో చెత్తను వేయకూడదని తెలిపారు. ప్లాస్టిక్‌రహిత మున్సిపల్‌గా నర్సాపూర్ మున్సిపల్‌ను తీర్చిదిద్దడానికి ప్రజలు భాగస్వాములు కావాలన్నారు. ప్లాస్టిక్‌రహిత మున్సిపల్ చేయడానికి ముందుగా వైన్ షాపుల ద్వారానే ప్రారంభించాలన్నారు. ఈమేరకు నర్సాపూర్‌లోని వైన్ షాప్‌ల వద్ద చెత్తాచెదారం, ప్లాస్టిక్ మొత్తం అపరిశుభ్రంగా ఉండడంతో జిల్లా కలెక్టర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. దీంతో వైన్ షాప్ యజమానులకు 5000రూపాయల జరిమానావిధించాలని మున్సిపల్ అధికారులను ఆదేశించారు. పారిశుధ్యం ప్రజారోగ్యం వార్డుల సమస్యలు పరిష్కారం కోసం మున్సిపాలిటీ అభివృద్ధి కోసం ప్రభుత్వం పటిష్టమైన చర్యలు తీసుకుంటుందని ఆయన వెల్లడించారు. వార్డుల్లో నెలకొన్న సమస్యల పరిష్కారానికి కార్యాచరణకు ప్రతిపాదన సిద్ధం చేసి ప్రభుత్వానికి పంపడం జరుగుతుందన్నారు. దీంతో నర్సాపూర్ మున్సిపాలిటీ అభివృద్ధి దిశగా వెళ్తుందని జిల్లా కలెక్టర్ రాహుల్‌రాజ్ పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్‌తోపాటు ఆర్డీవో మహిపాల్‌రెడ్డి, తహసీల్దార్ శ్రీనివాస్, మున్సిపల్ కమిషనర్ శ్రీరామ్‌చరణ్ రెడ్డి, మున్సిపల్ మేనేజర్ మధుసూదన్, శానిటరీ ఇన్స్పెక్టర్ మహేష్, ఎన్విరాన్మెంట్ ఎఈ శ్రీకాంత్, వర్క్ ఇన్స్పెక్టర్ భూపాల్ వివిధశాఖల అధికారులు, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

# సోలార్ విద్యుత్ ప్లాంట్ ఏర్పాటుకు స్థల పరిశీలన

**-ఆలయ భూములను పరిశీలించిన అధికారుల బృందం**

**నర్సాపూర్, జూన్ 28, ప్రభాతవార్త:**
రాష్ట్రప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపడుతున్న మహిళా సంఘాల ఆధ్వర్యంలో ఏర్పాటు అవుతున్న సోలార్ విద్యుత్ ఉత్పత్తి ప్లాంట్ ఏర్పాటులో భాగంగా శనివారం నర్సాపూర్‌లోని నర్సాపూర్-మెదక్ ప్రధాన రోడ్డులోగల శ్రీఆదిలక్ష్మీ నారాయణస్వామి ఆలయ భూములను పేదరిక నిర్మూలన సంస్థ హైదరాబాద్ చీఫ్ ఎడిటింగ్ ఆఫీసర్ కృష్ణారావు ఆధ్వర్యంలో అధికారుల బృందం పరిశీలించారు. నర్సాపూర్ మండలంలోని నాలుగు గ్రామ సంఘాల ద్వారా ఈ సోలార్ విద్యుత్ ఉత్పత్తి కేంద్రాన్ని ఏర్పాటు చేయబోతున్నారు. ఇందు కోసం అధికారుల బృందం సోలార్ విద్యుత్ ఉత్పత్తి కేంద్రం ఏర్పాటు స్థలానికి దగ్గరలో ఉన్న విద్యుత్ సబ్‌స్టేషన్‌కి పవర్ సప్లై ఇచ్చేవిధంగా ఉండాలన్నారు. ఈమేరకు అధికారుల బృందం స్థలాన్ని మొత్తం పరిశీలించింది. దగ్గరలో ఉన్న రెడ్డిపల్లి విద్యుత్ సబ్‌స్టేషన్‌ను పరిశీలన చేయడం జరిగింది. సోలార్ విద్యుత్ ఉత్పత్తికేంద్రంలో మొదటగా రెండు మెగా వాట్ల విద్యుత్ ఉత్పత్తిచేయడంతో ప్రారంభించడం జరుగుతుందని అధికారులు వెల్లడించారు.



ఆలయ భూములను పరిశీలిస్తున్న అధికారుల బృందం

కార్యక్రమంలో చీఫ్ ఎడిటింగ్ ఆఫీసర్ కృష్ణారావుతోపాటు జిల్లా గ్రామీణ అభివృద్ధి అధికారి శ్రీనివాసరావు, నాబార్డ్ ఎజిఎం రామారావు, నాబార్డ్ కన్సల్టెంట్ రామకృష్ణ, రెడ్ ప్రతినిధి రవీందర్ చౌహాన్, జిల్లా మేనేజర్, ప్రాజెక్టు మేనేజర్ మోహన్, విద్యుత్‌శాఖ ఎడిఎ రమణారెడ్డి, దేవాదాయశాఖ ఈవో శ్రీనివాస్, ఎపిఎం గౌరీ శంకర్, ఎపివో అంజిరెడ్డి, మండల సర్వేయర్ అభిలాష్, ఆయాశాఖల సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## కాసాల హత్యకేసులో నిందితుడు అరెస్టు, రిమాండ్

**-జిన్నారం సిఐ నయీముద్దీన్**




హత్య కేసు వివరాలు వెల్లడిస్తున్న సిఐ నయీముద్దీన్

**హత్నూర, జూన్ 28, ప్రభాతవార్త:**
హత్యకేసును ఛేదించి నిందితుని అరెస్టుచేసి రిమాండ్‌కు పంపినట్లు జిన్నారం ఇఐ నయీముద్దీన్ తెలిపారు. శనివారం హత్నూర పోలీస్ స్టేషన్లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ కాసాలశివారులో యువకుని హత్యకేసుకు సంబంధించిన వివరాలను వెల్లడించారు. ఈనెల 25న కాసాలగ్రామశివారులో ఒక యువకుని మృతదేహాన్ని కనుగొన్నామని అన్నారు. మృతుడు కాసాల గ్రామానికిచెందిన ఎరుకల శ్రీను (25)గా గుర్తించినట్లు తెలిపారు. సాంకేతిక సహకారంతో హత్యకు కారకుడైన దౌల్తాబాద్ గ్రామానికి చెందిన ఎరుకల యాదయ్యను శనివారం అరెస్టుచేసి రిమాండ్‌కు పంపినట్లు సిఐ నయీముద్దీన్ తెలిపారు. మృతుడు ఎరుకలి శ్రీనుకు నిందితుడు ఎరుకల యాదయ్యకు దూరపుబంధుత్వం ఉందని, ఇద్దరుగతంలో ఒకకేసులో నిందితులుగా ఉన్నారని, ఇద్దరి మధ్యన ఉన్న తగాదాలను దృష్టిలో పెట్టుకొని ఎరుకల శ్రీనును, ఎరుకల యాదయ్య హత్యచేసాడని సిఐ నయీముద్దిన్ తెలిపారు.

## చేసిన సేవలే గుర్తింపునిస్తాయి



మాట్లాడుతున్న ఎంఈఓ

**సదాశివపేట, జూన్ 28(ప్రభాత వార్త):**
ఉద్యోగ నిర్వహణలో చేసిన సేవలే గుర్తింపునిస్తాయని ప్రతి ఉద్యోగికి పదవి విరమణ తప్పనిసరి అని మండల విద్యాధికారి ఎన్ శంకర్, రిటైర్డ్ విద్యాధికారి అంజయ్యలు అన్నారు. శనివారం నాడు నందికంది జిల్లా పరిషత్‌లో పని చేస్తున్న ఉపాధ్యాయులు ప్రభావతి ఉద్యోగ విరమణ కార్యక్రమం జరిగింది. ప్రభావతి ఉపాధ్యాయ ఉద్యోగంలో చేరి 41 సంవత్సరాలు సేవలందించారన్నారు. నంది కంది పాఠశాలలో ఏడు సంవత్సరాల విధి నిర్వహణలో మంచి సేవలు అందించడం జరిగిందన్నారు. పదవి విరమణ అనంతరం శేష జీవితమంతా కుటుంబ సభ్యులతో ఆయురారోగ్యాలతో గడపాలన్నారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులువినయ్‌కుమార్, రాజశ్రీ, కృష్ణయ్య, బసవయ్య. సుజాత. కృష్ణారెడ్డి. పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## చీలపల్లిలో ఆకట్టుకున్నబాలమేళా

**మునిపల్లి, జూన్ 28(ప్రభాత వార్త):**
మునిపల్లి మండలం చీలపల్లి అంగన్వాడీ కేంద్రంలో ఏర్పాటు చేసిన బాలమేళా ఆకట్టుకుంది. ఈ కార్యక్రమానికి ఐసీడీఎస్ సూపర్ వైజర్ శైలజ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అంగన్వాడీ కేంద్రం లో 3సం. ల నిండిన పిల్లలు ఖచ్చితంగా జాయిన్ కావాలని సూచించారు. మేళాలో భాగంగా చిన్నారులు చేసిన కృత్యాలు గ్రామస్తులను ఆకట్టుకున్నాయి. గ్రామానికి చెందిన కాంగ్రెస్ అధ్యక్షుడు వీరన్న విద్యార్థులకు ఆట సామగ్రిని అందించారు. ఈకార్యక్రమంలో సూపర్ వైజర్ నాగమణి, అంగన్వాడీ టీచర్లు సుజాత, కవిత, రాంచందర్ రావు, మాజీ సర్పంచ్ వీరన్నపాటిల్, ప్రవీణ్ కుమార్, వివిధ గ్రామాల అంగన్వాడీ టీచర్లు, పిల్లల తల్లిదండ్రులు , గ్రామస్తులు పాల్గొన్నారు.

## మీసేవ కేంద్రాల తనిఖీ



మల్కాపూర్‌లో మీసేవ కేంద్రాన్ని తనిఖీ చేస్తున్న తహసిల్దార్ అశోక్

**కొండాపూర్, జూన్ 29(ప్రభాతవార్త):**
మండలంలోని మల్కాపూర్ క్రాస్ రోడ్డులో గల మీ సేవ కేంద్రాలనుశనివారం నాడు తహసిల్దార్ అశోక్ అనఖీ చేశారు. ప్రభుత్వ నిభందనలను పాటించాలని మీ సేవ ఆపరేటర్లకు సూచించారు. ప్రభుత్వం నిర్ణయించిన రుసుం కంటే అధికంగా వసూలు చేసనట్టు ఫిర్యాదులు వస్తే చర్యలు తీసుకుంటామన్నారు. భూమికి సంబందించిన దరఖాస్తులు ఆదాయం, కులము, నివాస ధృవపత్రాల దరఖాస్తులను సకాలంలో తమ కార్యాలయనికి పంపించాలన్నారు.

## హుగ్గెల్లిలో పాఠశాలలను పరిశీలించిన డీఈఓ

**జహీరాబాద్, జూన్ 28, ప్రభాతవార్త:**
మండలంలోని హుగ్గెల్లి గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, మండల ప్రజా పరిషత్ పాఠశాలలను శనివారం జిల్లా విద్యాధికారి వెంకటేశ్వర్లు ఆకస్మికంగా తనిఖీ చేశారు. జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 10వ తరగతి విద్యార్థులతో మాట్లాడుతూ వంద శాతం ఉత్తీర్ణత సాధించాలని, అందుకు క్రమ శిక్షణతో విద్యను అందుకోవాలని సూచించారు. ప్రణాళిక బద్ధంగా విద్యార్థులకు విద్యబోధన చేయాలని ఉపాధ్యాయులకు వివరించారు. ఎంపిపిఎస్ పాఠశాలలో అసంపూర్తిగా ఉన్న కిచెన్ హాల్, టాయిలెట్ రూమ్‌లను పరిశీలించారు. బేస్‌లైన్ పరీక్షలు నిర్వహించి ఆన్‌లైన్ చేయాలని ఆదేశించారు. డీఈఓ వెంట మండల విద్యాధికారి మాణయ్య తదితరులు ఉన్నారు.

## సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలి



సైబర్ నేరాలపై అవగాహన కల్పిస్తున్న ఎఎస్ఐ సుజాత

**కంది, జూన్ 28, ప్రభాతవార్త:**
సైబర్ నేరాలపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఎఎస్ఐ సుజాత పేర్కొన్నారు. మండల కేంద్రమైన కందిలోని రిజిష్టార్ కార్యాలయానికి చేరుకున్న ప్రజలకు ఎఎస్ఐ సుజాత సైబర్ నేరాలపై అవగాహన కల్పించారు. గుర్తు తెలియని వ్యక్తుల నుంచి వచ్చే ఫోన్ లింక్‌లను క్లిక్ చేయరాదని, ఇతరుకు ఓటిపి, తమ బ్యాంక్ వివరాలను వివరించవద్దన్నారు. సైబర్ నేరాలకు గురియితే వెంటనే పోలీసులను ఆశ్రయించాలని సూచించారు.

## ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణానికి భూమి పూజ

**రాయపోల్ జూన్28ప్రభాతవార్త**
తెలంగాణ రాష్ట్రంలో ఇండ్లు లేని నిరుపేదలు ఉండకూడదు అనే సంకల్పంతోనే ఇందిరమ్మ ఇండ్ల పథకం కాంగ్రెస్‌ప్రభుత్వం ప్రవేశపెట్టిందని దుబ్బాక నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ చెరుకు శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. శనివారం రాయపోల్ మండలపరిధిలోని గొల్లపల్లి, రాంసాగర్, కొత్తపల్లి, రాయపోల్‌తో పాటు పలు గ్రామాలలో లబ్దిదారులకు మంజూరు అయిన ఇందిరమ్మ ఇండ్లకు భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఇండ్లు లేని నిరుపేదలకు కాంగ్రెస్ ప్రభుత్వం ఇండ్లు కట్టుకునేందుకు విడతల వారిగా 5 లక్షల రూపాయలను ఇస్తుందని తెలిపారు. రాష్ట్రంలో ఆర్థిక పరిస్థితి బాగా లేనప్పటికి చిత్తశుద్దితో అభివృద్ధి, సంక్షేమ పథకాలను అమలు చేస్తుందని తెలిపారు. కార్యక్రమంలో బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు గొల్లపల్లి కనకయ్య, కాంగ్రెస్ మండల అధ్యక్షులు తప్పెట సుధాకర్, కిష్టారెడ్డి, లక్ష్మారెడ్డి, చుంచనకోట క్రిష్ణాగౌడ్, స్వామి, జనార్ధన్‌రెడ్డి, మంద కరుణాకర్, భాస్కర్, సురేష్, నరేష్ పాల్గొన్నారు.

## నూతన సిఐ,ఎస్ఐ లను కలిసిన కాంగ్రెస్ నాయకులు

**కొండాపూర్, జూన్ 28, ప్రభాతవార్త:**
నూతన సీఐ,ఎస్ఐల భాద్యతలు స్వీకరించిన సిఐ సుమన్ కుమార్, ఎస్ఐ సోమేశ్వరిలను శనివారంనాడు ఆత్మ కమిటీ చైర్మన్ వై ప్రభు, మాజీ ఎంపిటిసి నరసింహారెడ్డిలు ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మండలంలో శాంతి భద్రతలను కాపాడేందుకు కాంగ్రెస్ పార్టీ తరపున అన్ని రకాలుగా పోలీసులకు సహకరిస్తామన్నారు. సి.ఐ.సుమన్‌కుమార్, ఎస్ఐ సోమేశ్వరిలు మాట్లా డుతూ చట్ట పరిరక్షణకు సహకారం అందించాలన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు తదితరులు ఉన్నారు.

# గ్రామీణ ప్రాంతాల అభ్యున్నతే ధ్యేయంగా రోటరీ సేవలు

**-విద్యార్థులు మంచిగా చదువుకొని ఉన్నతులుగా ఎదగాలి**
**-పిడిజి రవి వడ్లమాని**

**ములుగు, జూన్ 28 (ప్రభాతవార్త):**
గ్రామీణ ప్రాంతాల అభివృద్ధి ధ్యేయంగా రోటరీ 3150 సేవా కార్యక్రమాలు నిర్వహిస్తుందని పిడిజి రవి వడ్లమాని అన్నారు. శనివారం ములుగు మండలం సింగన్నగూడ ఉన్నతపాఠశాలలో విద్యార్థినీవిద్యార్థులకు రోటరీ క్లబ్ ఆఫ్ గజ్వేల్, హెల్ప్ టు నీడీ సంస్థల సంయుక్త ఆధ్వర్యంలో సైకిళ్లను పంపిణీచేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఆయన మాట్లాడుతూ ప్రతి విద్యార్థి మంచిగా చదువుకొని ఉన్నతులుగా ఎదగాలని ఆ కాంక్షించారు. ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు బెంచీలు, బూట్లు గతంలో అందజేయడం జరిగిందని, నిష్ణాతులైన ఉపాధ్యాయులు ఉన్న ప్రభుత్వ బడుల్లో మెరుగైన వసతులు అందించాలనే లక్ష్యంతో హ్యాపీ స్కూల్స్ పేరుతో పలు సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు. నా నేస్తం నినాదంతో కోటి మొక్కలు నాటడమే లక్ష్యంగా పెట్టుకొని ఒక్కో విద్యార్థి తనకు నచ్చిన ఒక మొక్క నాటి వెసులుబాటు చేసుకొని మొక్కలను నాటి వాటిని కాపాడుకోవాలని, నాటిన మొక్కకు నచ్చిన పేరుపెట్టుకొని చెట్టుతో స్నేహంచేయాలని సూచించారు. భవిష్యత్తు బాగుండాలంటే విద్యార్థులు కష్టపడి ఇష్టంగా చదవాలని అప్పుడే భవిష్యత్తులో మంచి జీవితం ఉంటుందన్నారు. అనంతరం హెల్ప్ టు నీడి స్వచ్ఛందసంస్థ అధ్యక్షుడు సిఎస్. మహేష్‌రావు మాట్లాడుతూ సింగన్నగూడ పాఠశాల



విద్యార్థులకు సైకిళ్లను అందజేస్తున్న రోటరీ క్లబ్, హెల్ప్ టు నీడి సంస్థ సభ్యులు

విద్యార్థులకు స్పోర్ట్స్ డ్రెస్ అందించేందుకు కృషి చేస్తానని చెప్పారు. అవసరం ఉన్న ప్రతి చోట హెల్ప్ టు నీడి సంస్థ ఆధ్వర్యంలో ఆయా సేవా కార్యక్రమాలు నిర్వహించేందుకు ముందుంటామని వివరించారు. కార్యక్రమంలో టిడిజిలు రాజ్యలక్ష్మి, హనుమంతరెడ్డి, క్లబ్ చైర్మన్లు కొడాలి చంటి, దాస జగదీశ్వర్, కుంట కరుణాకర్‌రెడ్డి, బాబుగౌడ్, క్లబ్ అధ్యక్షుడు నరసింహారెడ్డి, కార్యదర్శి శ్రీనివాస్‌గౌడ్, కోశాధికారి సాయిరెడ్డి, డిసిసిబి జిల్లా డైరెక్టర్ బట్టు అంజిరెడ్డి, మండలవిద్యాధికారి ఉదయభాస్కర్‌రెడ్డి, పాఠశాల ప్రధానోపాధ్యాయుడు రహీం, మాజీ సర్పంచ్ బాలకృష్ణ, రోటరీ పూర్వ అధ్యక్షులు డాక్టర్ పురుషోత్తం, డాక్టర్ ఆనంద్‌రెడ్డి, కడపల నరసింహారెడ్డి, సందుగారి నరసింహారెడ్డి, క్లబ్‌సభ్యులు బట్టు అంజిరెడ్డి, బాలకృష్ణ, బాలరాజు, గ్రామస్తులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలి

**-జోగిపేట ప్రభుత్వ ఆసుపత్రిని ఆకస్మిక తనిఖీ చేసిన డిసిహెచ్ఎస్ సంగారెడ్డి**



జోగిపేట ప్రభుత్వ ఆసుపత్రిలో అందుతున్న సేవల గురించి రోగులకు అడిగి తెలుసుకుంటున్న డిసిహెచ్ఎస్ సంగారెడ్డి

**జోగిపేట, జూన్28, ప్రభాతవార్త:**
వర్షాకాలంలో సీజనల్ వ్యాధులు ప్రబలే అవకాశం ఉన్నందున అప్రమత్తంగా ఉండాలని డిసిహెచ్ఎస్ సంగారెడ్డి సూచించారు. శనివారంనాడు జోగిపేట ఏరియా ఆసుపత్రిని ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆసుపత్రిలో అన్నివార్డులను పరిశీలించారు. ఆసుపత్రి ల్యాబ్‌లో అందుతున్న సేవల పట్ల ఆయన సంతృప్తిని వ్యక్తం చేశారు. అంతేకాకుండా ఈ నెలలో ఆర్థో విభాగంలో ఐదు మేజర్ సర్జరీలు, జనరల్ విభాగంలో కూడా సర్జరీలు జరుగుండటం ప్రశంసనీయమన్నారు. ముఖ్యంగా ఆసుపత్రిలో సీజనల్ వ్యాధులకు సంబంధించిన అన్ని డ్రగ్స్ అందుబాటులో ఉంచుకోవాలని, ఎట్టిపరిస్థితుల్లో మెరుగైన వైద్యం అందేలా చూసుకోవాలని, ఏలాంటి ఫిర్యాదులు రాకుండా ఆసుపత్రిలో రోగులకు సేవలు అందించాలని ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ సౌజన్యకు ఆయన ఆదేశించారు.

## సైబర్ మోసాలపై యువత అవగాహన పెంచుకోవాలి!

**పోసానిపేటలో సదస్సు నిర్వహించిన మేజిస్ట్రేట్**



సైబర్ మోసాలపై అవగాహన కల్పిస్తున్న జోగిపేట మున్సిఫ్‌కోర్టు మేజిస్ట్రేట్ మహ్మద్ అసదుల్లా షరీఫ్

**జోగిపేట, జూన్28, ప్రభాతవార్త:**
ఆధునిక ప్రపంచంలో సోషల్ మీడియా కీలక భూమిక పోషిస్తుందని, అయితే ఈ సోషల్ మీడియా వల్ల చాలామంది యువతీయువకులు తమ జీవితాల్ని నాశనం చేసుకుంటున్నారని జోగిపేట మున్సిఫ్‌కోర్టు మెజిస్ట్రేట్ మహ్మద్ అసదుల్లా షరీఫ్ అన్నారు. శనివారంనాడు మండల పరిధిలోని పోసానిపేట జిల్లా పరిషత్ పాఠశాలలో నిర్వహించిన న్యాయ అవగాహన సదస్సులో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. కార్యక్రమంలో జోగిపేట బార్ అధ్యక్షులు చంద్రారెడ్డి, న్యాయవాదులు నర్సింలు, ఇంచార్జ్ ప్రధానోపాధ్యాయులు క్రిష్ణయ్య తదితరులు పాల్గొన్నారు.

## నేడు రామాయంపేటలో విద్యుత్ సరఫరాకు అంతరాయం

**రామాయంపేట మున్సిపాలిటీ, జూన్ 28, ప్రభాతవార్త :**
రామాయంపేటలోని 33/11 కెవి సబ్ స్టేషన్ పరిధిలో నేడు (ఆదివారం) విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడుతుందని టీజీఎస్పీడీసీఎల్ అధికారులు, ఏడీఈ ఆదయ్య, ఏఈ తిరుపతి రెడ్డిలు ఒక ప్రకటనలో తెలిపారు. రామాయంపేట ప్రభుత్వ ఆసుపత్రికి సంబంధించిన 11కెవి డెడికేటెడ్ ఫీడర్ కనెక్షన్ పనులు జరుగుతున్నందున ఈ అంతరాయం ఏర్పడుతుందని వారు వెల్లడించారు. ఉదయం 11 గంటల నుండి సాయంత్రం 4 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయబడుతుందన్నారు. ఈ పనుల కారణంగా దామారచెరువు, రామాయంపేట వ్యవసాయ సరఫరా, రామాయంపేట పట్టణంలో విద్యుత్ సరఫరా ఉండదు అని తెలిపారు. రైతులు, పట్టణ ప్రజలు, వినియోగదారులకు సహకరించాలని కోరారు.

## కురుమ సంఘం మండల నూతన కార్యవర్గం

**-సంఘం అధ్యక్షులుగా శంకరయ్య**

**రామచంద్రాపురం, జూన్ 28, ప్రభాతవార్త:**
కురుమ సంఘం, కురుమ సంఘం యువత పటాన్‌చెరు మండల కమిటీలను శనివారం ఎన్నుకున్నారు. సంఘ మండల అధ్యక్షులుగా మారగారి శంకరయ్య, ఉపాధ్యక్షులుగా లక్ష్మణ్, ప్రధాన కార్యదర్శిగా మామిడిపల్లి రవి, సహాయ కార్యదర్శిగా ఈశ్వర్, కోశాధికారిగా రాములు, సలహాదారులుగా పోచారం కిష్టయ్యలను ఎన్నుకున్నారు. కురుమ సంఘం యువత మండల కమిటిని సైతం ఎన్నుకున్నారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా జిల్లా నాయకులు బూరుగడ్డ నగేష్ కురుమ, గొర్రెల పెంపకం దారుల సహకార యూనియన్ మాజీ డైరెక్టర్లు అంబారి ఈశ్వరయ్య, పెద్దగొల్ల నగేష్, సంగారెడ్డి నియోజకవర్గ కురుమ యువత అధ్యక్షులు కొత్తగొల్ల సోమశేఖర్‌లు హాజరయ్యారు. కురుమ సంఘం అభివృద్ధికి పెద్దల సహకారంతో తమ వంతు కృషి చేస్తామని నూతన కార్యవర్గ బాధ్యులు ప్రకటించారు. కార్యక్రమంలో పటాన్‌చెరు నియోజకవర్గ కురుమ కురుమ కుల సోదరులు పాల్గొన్నారు.

**కురుమ సంఘం మండల నూతన కార్యవర్గం...**

**-సంఘం అధ్యక్షులుగా శంకరయ్య**

కురుమసంఘం, కురుమసంఘంయువత పటాన్‌చెరుమండలకమిటీలను శనివారం ఎన్నుకున్నారు. సంఘ మండల అధ్యక్షులుగా మారగారి శంకరయ్య, ఉపాధ్యక్షులుగా లక్ష్మణ్, ప్రధాన కార్యదర్శిగా మామిడిపల్లి రవి, సహాయ కార్యదర్శిగా ఈశ్వర్, కోశాధికారిగా రాములు, సలహాదారులుగా పోచారం కిష్టయ్యలను ఎన్నుకున్నారు. కురుమసంఘం యువత మండలకమిటిని సైతం ఎన్నుకున్నారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా జిల్లా నాయకులు బూరుగడ్డ నగేష్ కురుమ, గొర్రెల పెంపకం దారుల సహకార యూనియన్ మాజీ డైరెక్టర్లు అంబారి ఈశ్వరయ్య, పెద్దగొల్ల నగేష్, సంగారెడ్డి నియోజకవర్గ కురుమ యువత అధ్యక్షులు కొత్తగొల్ల సోమశేఖర్‌లు హాజరయ్యారు. కురుమ సంఘం అభివృద్ధికి పెద్దల సహకారంతో తమ వంతు కృషి చేస్తామని నూతన కార్యవర్గ బాధ్యులు ప్రకటించారు. కార్యక్రమంలో పటాన్‌చెరు నియోజకవర్గ కురుమ కురుమ కుల సోదరులు పాల్గొన్నారు.

## డ్రాపౌట్ విద్యార్థిని కేజీబీవీలో చేర్పించిన ఎంఈఓ

**సిర్గాపూర్, జూన్ 28, ప్రభాతవార్త:**
మండల పరిధిలోని లక్ష్మణ్ నాయక్ తాండకు చెందిన బడిబయట ఉన్న బడిఈడు (డ్రాపౌట్) విద్యార్థినిని శనివారం ఎంఈఓ నాగారం శ్రీనివాస్ బడిలో చేర్పించారు. శనివారం ఎంఈఓ శ్రీనివాస్ సిఆర్పి శివకుమార్‌తో కలిసి తాండను సందర్శించి బడికి దూరంగా ఉంటున్న బాలికలను గుర్తించి కుటుంబ సభ్యులకు విద్యపై అవగాహన కల్పించి సిర్గాపూర్‌లోని కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయంలో 7వ తరగతో చేర్పించారు.

## సిఎంఆర్ఎఫ్ చెక్కు పంపిణి

**సిర్గాపూర్, జూన్ 28, ప్రభాతవార్త:**
మండల పరిధిలోని బుబారక్‌పూర్ గ్రామానికి చెందిన బసంత్‌కౌర్ అనారోగ్యానికి గురవడంతో కార్పోరేటర్ ఆసుపత్రిలో మెరుగైన వైద్యం అందుకునేందుకు ఎంపి సురేష్‌కుమార్‌శెట్కార్ సహకారంతో 20వేల రూపాయల సిఎంఆర్ఎఫ్ నిధులను మంజూరు చేయించి బాధితులకు శనివారం అందచేసినట్లు రాష్ట్ర యూత్ కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి రాకేష్ శెట్కార్ పేర్కొన్నారు.

## పంచాయతీ కార్యదర్శిపై ఫిర్యాదు

**చిన్నశంకరంపేట, జూన్ 28, ప్రభాతవార్త:**
చిన్నశంకరంపేట మండల పరిధి చందంపేట గ్రామ పంచాయతీ కార్యదర్శిపై ఎంపీవో గిరిజా రాణికి గ్రామస్తులు శనివారం ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పంచాయతీ కార్యదర్శిగా ఉన్న పద్మ సమస్యలపై స్పందించడం లేదని, విధులను సక్రమంగా నిర్వర్తించడం లేదన్నారు. నూతనంగా నిర్మిస్తున్న పరిశ్రమ విషయంలో గ్రామస్తులు అభ్యంతరం చెబుతున్నప్పటికి వారికి సహకరిస్తున్నారని ఆరోపించారు. సమస్యల విషయంలో ఫోన్ చేసిన స్పందించరని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ విషయమై ఎంపీవోకు ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. కాగా విచారణ జరిపి పై అధికారులకు నివేదిస్తానని ఎంపీవో తెలిపారు.

## విద్యార్థులకు నోట్ పుస్తకాల పంపిణి

**చిన్నశంకరంపేట, జూన్ 28, ప్రభాతవార్త:**
మండల పరిధి అంబాజీపేటలోని ప్రభుత్వ పాఠశాలలో బిఆర్ఎస్ యువ నాయకుడు బైండ్ల రాజ్ కుమార్ శనివారం విద్యార్థులకు నోట్ పుస్తకాలను పంపిణి చేశారు. విద్యార్థులు చదువులో రాణించాలని రాజ్‌కుమార్ ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయురాలు అన్నపూర్ణ, నాయకులు బాలకిషన్, చంద్రంగౌడ్, శ్రీనివాస్, లక్ష్మణ్, దశరథం, సిద్దిరాములు, మోహన్, రషీద్, రంజిత్, రామ్, మహేష్, సంతోష్, విద్యార్థులు పాల్గొన్నారు.

## కూలిన విద్యుత్ స్తంభాలను పరిశీలించిన మాజీ ఎమ్మెల్యే పద్మారెడ్డి

**హవేళిఘనపూర్, జూన్ 28, ప్రభాతవార్త:**
ఇటీవల పెద్ద ఎత్తున వీచిన గాలి, కురిసిన వర్షానికి కూలిన విద్యుత్ స్తంభాలను పరిశీలించిన మెదక్ మాజీ ఎమ్మెల్యే యం. పద్మదేవేందర్ రెడ్డి పరిశీలించారు. హవెలిఘనపూర్ మండలంలోని స్కూల్ తండాలో బుధవారం రాత్రి కురిసిన భారీ వర్షానికి 33 కెవి విద్యుత్ లైన్ 9 స్తంభాలు కూలిపోయాయి. ఈ సంఘటన స్థలాన్ని శనివారం నాడు మెదక్ జిల్లా బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షురాలు మాజీ ఎమ్మెల్యే యం. పద్మ దేవేందర్ రెడ్డి మండల నాయకులతో కలసి పరిశీలించారు. విద్యుత్ ఎస్సీ శంకర్ తో ఫోన్లో మాట్లాడి స్కూల్ తండా మీదుగా ఉన్న 33 కెవి విద్యుత్ లైన్ ను వేరే చోటుకు మార్చాలని సూచించారు. విద్యుత్ ఎస్సీ ఆఫీసులోనే ఉండటంతో తాండవాసులతో కలిసి మెదక్ విద్యుత్ ఎస్సీ కార్యాలయానికి వెళ్లి విద్యుత్ ఎస్సీ శంకర్‌కు మెమొరండం ఇచ్చారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఈనెల 25వ తేదీన పెద్ద ఎత్తున వీచిన గాలి, వర్షానికి హవెలిఘనపూర్ మండలంలోని స్కూల్ తండాలో 33 కెవి లైన్ 9 స్తంభాలు కూలిపోయాయి అని అన్నారు. సంఘటన స్థలాన్ని పరిశీలించి విద్యుత్ స్తంభాలు కూలిపోయిన సమయంలో అక్కడ ఎవరూ లేకపోవడంతో ప్రమాదం తప్పిందన్నారు. స్కూల్ తండాలో ఇండ్ల పొలాల మీదుగా ఉన్న పాత లైన్ ను వేరే చోటుకు మార్చాలని సూచించారు. మూడు రోజులుగా తాండ ప్రజలు కరెంటు లేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. కొత్తగా వేసే లైన్ ను ఇండ్ల మీదుగా పొలాలలో కాకుండా రోడ్డు వెంట వేయాలని ఎస్సీని కోరారు. వెంటనే స్పందించిన విద్యుత్ ఎస్సీ శంకర్ సాయంత్రం వరకు 11 కెవి లైన్ ద్వారా స్కూల్ తండా కు విద్యుత్ సరఫరా అందిస్తామని అన్నారు. వారం రోజుల్లో రోడ్డు వెంట కొత్త లైన్ వేసి నిరంతరం విద్యుత్ పునరుద్ధరణ అందిస్తామని హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా తాండ వాసులు మాజీ ఎమ్మెల్యే పద్మ రెడ్డికి, విద్యుత్ ఎస్సీ శంకర్ కృతజ్ఞతలు తెలిపారు. వీరి వెంట జిల్లా పరిషత్ మాజీ ఉపాధ్యక్షురాలు యం. లావణ్య రెడ్డి, హవెలిఘనపూర్ మండల పార్టీ అధ్యక్షులు సిహెచ్. శ్రీనివాస్ రెడ్డి , స్కూల్ తాండ తాజా మాజీ సర్పంచ్ యశోదా రంజా, మాజీ ఎంపీటీసీ మంగ్యా నాయక్, మాజీ వార్డ్ మెంబర్ లు రవి నాయక్, బాధ్య నాయక్, నాయకులు మ్యాకల. సాయిలు, యామి రెడ్డి దాస్, గణేష్, తదితరులు ఉన్నారు.

## విద్యుత్తు షాక్‌కు గురై ఓ వ్యక్తి మృతి

**కోట్‌పల్లి, జూన్ 28, ప్రభాతవార్త;**
పంట పొలానికి సోలార్ వేయడంతో సోలార్‌పై విద్యుత్తు తీగ పడటంతో విద్యుత్తు షాక్‌కు గురై ఓ వ్యక్తి మృతి చెందిన సంఘటన కోట్‌పల్లి పోలీస్‌స్టేషన్ పరిధిలో శనివారం నాడు ఉదయం చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం ఇలా ఉన్నాయి. కోట్‌పల్లి మండల పరిధిలోని బార్వాద్ గ్రామానికి చెందిన పట్లోళ్ల మహేందర్‌రెడ్డి తండ్రి నాగిరెడ్డి వయస్సు 57, సంవత్సరాలు గ్రామంలో ఉదయం పదిన్నర గంటల సమయంలో తన పంట పోల్లం చూట్టు పందుల బెడద కోసం సోలార్ పెన్సింగ్ వేశాడు. సోలార్ పెన్సింగ్ పై విద్యుత్తు తీగ పడి ఉండటం గమనించకపోవడంతో సోలార్ వైర్ దాటుతుండగా ఎడమకాలుకి వైర్ తగలడంతో అక్కడే కింద పడిపోయాడు. కుటుంబ సభ్యులు వెంటనే సదాశివపేట్‌లోని ఆద్య ఆసుపత్రికి తీసుకెళ్ళగా అక్కడ ఉన్న డాక్టర్ చూసి అప్పటికే మృతి చెంది ఉన్నాడని కుటుంబ సభ్యులకు తెలపడం జరిగిందని బార్య నాగమణి పిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకోని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై శైలజ, పేర్కొన్నారు,

**పట్లోళ్ళ మహేందర్‌రెడ్డి బిజెపికి తీరని లోటు...**
పట్లోళ్ళ మహేందర్‌రెడ్డి బిజెపికి తీరని లోటు అని కోట్‌పల్లి మండల బిజెపి పార్టీ అధ్యక్షులు శివకుమార్ అన్నారు. బిజెపి పార్టీ మనం మంచి నాయకుడిని కోల్పోయాం అన్నారు. వారు పార్టీకి ఎన్నో సేవాలు చేయడం జరిగిందని మా మధ్యలో అయన లేకపోవడం చాలా బాధాకరమన్నారు. అయన మృతి చెందడం చాలా బాధాకరంగా ఉందని అయన ఆత్మకు శాంతి ప్రసాదించాలని కోరుకుంటూ వారి కుటుంబసభ్యులకు ప్రగాఢసానుభూతి తెలియజేశారు.

## ఉదారత చాటుకున్న హెచ్ఎం స్నేహితులు

**పాపన్నపేట, జూన్ 28, ప్రభాతవార్త :**
పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు స్నేహితులు పాఠశాల విద్యార్థులకు స్పోర్ట్స్ డ్రెస్సులు, బ్యాగులు బూట్లు అందించి తమ ఉదారత చాటుకున్నారు. పాపన్నపేట మండల పరిధిలోని ఎంకేపల్లి కాలనీ ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు 30వేల విలువగల సామాగ్రి అందించారు. పాఠశాల హెచ్ఎం సుమలత 1992-96 సంవత్సరాలలో వర్గల్ నవోదయ పాఠశాలలో చదువుకున్నారు. తాను పనిచేస్తున్న పాఠశాలలో సౌకర్యాల కొరతపై తమ సహచర పూర్వ విద్యార్థులకు తెలపడంతో వారు స్పందించి విద్యార్థులకు స్పోర్ట్స్ డ్రెస్సులు, షూలు తదితర వస్తువులు అందించారు. ఈ కార్యక్రమంలో మండల విద్యాధికారి ప్రతాప్‌రెడ్డి, పంతులురాజు, మాజీసర్పంచ్‌మల్లేశం తదితరులు పాల్గొన్నారు.

## పాపన్నపేట మండలంలో మాజీ ఎమ్మెల్యేల సుడిగాలి పర్యటన



ముద్దాపూర్ మాజీ సర్పంచ్‌ను పరామర్శిస్తున్న మాజీ ఎమ్మెల్యే పద్మాదేవేందర్‌రెడ్డి

**పాపన్నపేట, జూన్ 28, ప్రభాతవార్త :**
పాపన్నపేట మండల పరిధిలోని వివిధ గ్రామాల్లో మెదక్ మాజీ ఎమ్మెల్యేలు పద్మాదేవేందర్ రెడ్డి, శశిధర్ రెడ్డిలు శనివారం సుడిగాలి పర్యట నిర్వహించారు. ఈ సందర్భంగా ముద్దాపూర్ గ్రామ మాజీ సర్పంచ్ దానయ్య ఇటీవల కంటి ఆపరేషన్ చేయించుకున్నారు. దానయ్య కు పరామర్శించి ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు, అలాగే చీకోడ్ తాజా మాజీ సర్పంచ్ విజయ తిరుపతిరెడ్డి కూతురు వివాహం ఇటీవల జరిగింది. వారి గృహానికి చేరుకొని విజయ తిరుపతిరెడ్డి కూతురుని ఆశీర్వదించి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం కొత్త లింగాయిపల్లిలో పెద్దమ్మ గుడి నిర్మాణం కోసం ఈరోజు స్లాబ్ వేయడం సందర్భంగా కొబ్బరికాయ కొట్టి ప్రారంభించారు. నర్సింగ్ రావు పల్లి తండాలో ఇటీవల రోడ్ ప్రమాదంలో ఇద్దరు యువకులు మరణించారు, వారి కుటుంబ సభ్యులను పరామర్శించి ఓదార్చారు. యూసఫ్ పేట మాజీ సర్పంచ్ ఎరుపుల దాసు కిడ్నీ సమస్యలతో డయాలసిస్ చేయించుకుంటున్నారు. దాసును పరామర్శించి, మనోధైర్యాన్ని తెలిపారు. గాంధారిపల్లి గ్రామ బిఆర్ఎస్ అధ్యక్షులు విశ్వం గారి తండ్రి ఇటీవల మరణించారు, వారి కుటుంబ సభ్యులను పరామర్శించి ప్రగాఢ సానుభూతిని తెలిపారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ల ఫోరం మాజీ అధ్యక్షుడు కుమ్మరి జగన్, ఏడుపాయల మాజీ చైర్మన్ బాల గౌడ్ , మండల పార్టీ అధ్యక్షులు విష్ణువర్ధన్ రెడ్డి, ,తాజా మాజీ సర్పంచ్ లు గురుమూర్తి గౌడ్ లింగారెడ్డి, శ్రీనాథ్ రావు, నవీన్ గౌడ్, బద్రి మల్లేశం, నాయకులు దుర్గయ్య, కిష్టయ్య, తిరుపతిరెడ్డి, అనిల్‌రెడ్డి, గోపాల్ సాయి రెడ్డి, ఆంటోనీ, తదితరులు ఉన్నారు.

## యూత్ కాంగ్రెస్ జాతీయ అధ్యక్షున్ని కలిసిన ఆంక్షరెడ్డి



యూత్ కాంగ్రెస్ జాతీయ అధ్యక్షునితో తూంకుంట ఆంక్షరెడ్డి

**మర్కుక్, జూన్ 28 (ప్రభాతవార్త):**
యూత్ కాంగ్రెస్ జాతీయ అధ్యక్షుడు ఉదయ్‌భానును శనివారం ఢిల్లీలో తెలంగాణ రాష్ట్ర యూత్ కాంగ్రెస్ ఉపాధ్యక్షురాలు తూంకుంట ఆంక్షరెడ్డి మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రాష్ట్రంలో యూత్ కాంగ్రెస్ పరిస్థితులపై ఆయనతో చర్చించినట్లు తెలిపారు. పార్టీ బలోపేతానికి యువజన కాంగ్రెస్ కార్యకర్తలు ఎంతో కష్టపడి పనిచేస్తున్నారని తెలిపారు.

## సిఐని కలిసిన రైతు సమాఖ్య నాయకులు



సీఐ ని కలిసిన రైతు సమాఖ్య నాయకులు

**సదాశివపేట, జూన్ 28(ప్రభాత వార్త):**
కొండాపూర్ సర్కిల్ నుండి బదిలీపై వచ్చిన సిఐ వెంకటేశం తెలంగాణ మంజీరా రైతు సంఘం అధ్యక్షుడు సదాశివపేట పోలీస్ స్టేషన్లో మర్యాదపూర్వకంగా కలిశారు. 1983-84సంవత్సరంలో పదవ తరగతి చదువుకున్న మిత్రులు శంకర్, సంగమేశ్వర్ శ్రీనివాస్ రెడ్డి వెంకట్రావు లతో కలిసి వారిని శాలువా పూలమాలతో సత్కరించారు. మాదకద్రవ్యాలు వినియోగాన్ని అరికట్టడానికి పోలీసు యంత్రాంగం చేస్తున్న కృషి బాగుందని పృథ్వీరాజ్ అన్నారు. డ్రగ్స్ వినియోగాన్ని వివిధ రూపాలలో అందుబాటులోకి తెస్తున్నందున యువతను విద్యార్థులను జాగ్రత్తగా ఉండేటట్లు మనమందరం కృషి చేయాలని అన్నారు.

## ఆర్థిక సహాయాన్ని అందచేసిన రాంరెడ్డి

**చౌటకూరు, జూన్ 28, ప్రభాతవార్త:**
మండల కేంద్రమైన చౌటకూరులో ఇటీవల అనారోగ్యంతో అనంత లోకాలకు చేరిపోయిన చిద్రుప్ప పెంటయ్య, ఖాజాపాషాల కుటుంబ సభ్యులు (సతీమణిలు) ఎల్లమ్మ, నసీమా బేగంలకు పీఆర్ఆర్ చైర్మన్ పార్కల రాంరెడ్డి తన వంతుగా 20వేల రూపాయల ఆర్థిక సహాయం అందచేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్ గ్రామ కమిటి అధ్యక్షులు పర్కల రమేష్, నాయకులు కొల్కూరి మొగులయ్య, ఆగమయ్య, మన్నె లింగయ్య, కరుణాకర్ తదితరులు ఉన్నారు.

## ఘనంగా పూరి జగన్నాథ్ రథయాత్ర

**జహీరాబాద్, జూన్ 28, ప్రభాతవార్త:**
పూరి జగన్నాథ్ స్వామి రథోత్సవాన్ని శనివారం జహీరాబాద్ పట్టణంలో హింధూ సంఘాల ఆధ్వర్యంలో భక్తి శ్రద్ధలతో ఘనంగా జరుపుకున్నారు. పట్టణంలోని హనుమాన్ మందిరం నుంచి జగన్నాథ రథ యాత్రను ప్రారంభించి జాతీయ రహదారి గుండా వాసవి కళ్యాణ మండలం వరకు కొనసాగింది. కార్యక్రమంలో బిజెపి నాయకులు గొల్ల భాస్కర్, శ్రీనివాస్‌గౌడ్, పూల సంతోష్, నరేష్ పాటిల్, కొత్తకాపు సురేందర్‌రెడ్డి, అశోక్ బిల్కరి, శివరాజ్, హింధూ సంఘాల ప్రముఖులు పాల్గొన్నారు.

## విద్యార్థులకు దుస్తులు, నోట్ పుస్తకాల పంపిణి

**చిన్నశంకరంపేట, జూన్ 28, ప్రభాతవార్త:**
మండల పరిధి కామారం గ్రామ ప్రాథమిక పాఠశాలకు చెందిన విద్యార్థులకు శనివారం కామారెడ్డికి చెందిన ఎన్ఆర్ఐ స్వామి నోటుపుస్తకాలు, దుస్తులు, బ్యాగు, పెన్నులు అందించారు. గ్రామానికి చెందిన వెంకమ్మ ఇటీవల మృతి చెందగా ఆమె మనుమడు స్వామి కుటుంబసభ్యులు ఆమె జ్ఞాపకార్థంగా అందించినట్లు తెలిపారు. పాఠశాల అభివృద్ధికి తన వంతు సహాయ సహకారాలు అందిస్తానని తెలిపారు. కార్యక్రమంలో కామారం గ్రామ తాజా మాజీ సర్పంచి పూలపల్లి యాదగిరి యాదవ్, ఉపాధ్యాయులు అశోక్, సత్యం, పోచమ్మ, హనుమవ్వ, బాలమణి, రాజమణిలు పాల్గొన్నారు.

## బ్రహ్మంగారి ఆలయంలో మండలం పూజలు



బ్రహ్మంగారి ఆలయంలో మండలంపూజా కార్యక్రమాల దృశ్యం

**రామచంద్రాపురం, జూన్ 28, ప్రభాతవార్త:**
మండల పరిధిలోని తెల్లాపూర్ మున్సిపాలిటీలోని బ్రహ్మంగారి ఆలయంలో విశ్వకర్మ కులస్థులు స్వామి వారికి త్రైక మండలం పూజా కార్యక్రమాలు భక్తి శ్రద్ధలతో నిర్వహిస్తున్నారు. బ్రహ్మంగారి నిర్మాణం విగ్రహాల ప్రతిష్టాపన జరిగి నేటితో 41 రోజులు పూర్తయిన సందర్భంగా శనివారం ఆలయంలో విశ్వకర్మకులస్థులు అభిషేకాలు, హోమాలు, ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ఆలయానికి చేరుకున్న భక్తులకు ఆలయ అర్చకులు ఆశీర్వచనాలుచేసి తీర్థప్రసాదాలు అందచేశారు. కార్యక్రమంలో విశ్వకర్మకులస్థులు శ్రీశైలంచారి, గోపాల్‌చారి, ప్రకాష్‌చారి, శ్రీరాములుచారి, భీమలింగంచారి, బ్రహ్మంచారి, కృష్ణచారి, నరహరిచారరి తదితరులు పాల్గొన్నారు.

## కూచన్‌పల్లిలో వనభోజనాలు..



సమావేశంలో మాట్లాడుతున్న సంఘం అధ్యక్షుడు శలాక రాజేశ్వరశర్మ

**రామాయంపేట, జూన్ 28, ప్రభాతవార్త:**
శ్రీవిశ్వవసు నామ సంవత్సరం ఆషాఢమాసం పురస్కరించుకొని మెదక్ జిల్లా బ్రాహ్మణ సంఘం ఆధ్వర్యంలో ఈనెల 29వ తేదీ ఆదివారం మెదక్ మండలంలోని కూచన్‌పల్లి శ్రీవేంకటేశ్వరస్వామి దేవాలయం ప్రాంగణంలో బ్రాహ్మణకుటుంబసభ్యుల సమావేశం నిర్వహించనున్నట్లు జిల్లా బ్రాహ్మణ సంఘం అధ్యక్షుడు శలాక రాజేశ్వరశర్మ, ప్రధానకార్యదర్శి కాశీనాథ్‌రావు, కోశాధికారి హరిశర్మ తెలిపారు. జిల్లాలో ఉన్న బ్రాహ్మణులంతా వారి కుటుంబసమేతంగా కలుసుకొని, ఆ ఒక్కరోజు అంత్యాక్షరి, సంగీత్, కోలాటాలు, ఆటపాటలు నిర్వహించినట్లు తెలిపారు.
అలాగే చదువులో రాష్ట్రస్థాయిలో, జిల్లాస్థాయిలో ఉత్తమప్రతిభ చాటిన పదవతరగతి, ఇంటర్‌లలో మంచిమార్కులుసాధించిన విద్యార్థినీవిద్యార్థులకు, ఐఐటి, యన్‌ఐటి, యంబిబియస్‌లలో సీట్లు సాధించిన పిల్లలకు, అలాగే వివిధ కళల్లో నైపుణ్యం ఉన్న పిల్లలకు వారితల్లిదండ్రులకు సంఘం తరపున చిరుసత్కారం చేయనున్నట్లు తెలిపారు. సభ్యులందరూ సంప్రదాయ దుస్తులు ధరించి సమావేశానికి హాజరు కావాలని, కోలాటాలు ఆడే వారు కోలలు తెచ్చుకోవాలనీ సూచించారు. ఉదయం 10:00 నుండి సాయంత్రం 5:00 వరకు వివిధ కార్యక్రమాలు జరుగుతాయన్నారు.. జిల్లాలో ఉన్న బ్రాహ్మణ సంఘం సభ్యులందరూ కుటుంబ సమేతంగా సకాలంలో హాజరు కావాలని వారు కోరారు.

## నాణ్యమైన విత్తనాలతో అధిక దిగుబడి



విత్తనాలను చూపెడుతున్న దృశ్యం

**రామాయంపేట, జూన్ 28, ప్రభాతవార్త:**
ప్రభుత్వ రంగ సంస్థ అయినటువంటి తెలంగాణ విత్తనాభివృద్ధి సంస్థ నిపుణుల పర్యవేక్షణలో విత్తనోత్పత్తిజరిపి రైతులకు నాణ్యమైన విత్తనాలను అందుబాటులో ఉండేవిధంగా ప్రాథమిక సహకారసంఘం ద్వారా వరి విత్తనాలను అందుబాటులో ఉంచడం జరుగుతుందని తెలంగాణ విత్తనాభివృద్ధి సంస్థ ప్రతినిధి రవీందర్ తెలిపారు. ఈసందర్భంగా జరిగిన కార్యక్రమంలో సహాయ వ్యవసాయ సంచాలకులు రాజ్‌నారాయణ పాల్గొని మాట్లాడుతూ తెలంగాణ విత్తనాభివృద్ధి సంస్థ నాణ్యమైన మూల విత్తనం నుండి సర్టిఫైడ్ విత్తనం, ట్రూత్‌ఫుల్ లేబుల్ కలిగిన విత్తనాలను ఉత్పత్తి చేయడం జరుగుతుందని, నాణ్యమైన విత్తనాల ద్వారానే రైతులు అధిక దిగుబడులను సాధించవచ్చని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ప్రాథమిక సహకార సంఘం చైర్మన్ బాధే చంద్రం, సిఈఓ నర్సింలు విత్తన అభివృద్ధి సంస్థ ప్రతినిధి రవీందర్‌తోపాటు పలువురు పాల్గొన్నారు. ప్రాథమిక సహకార సంఘం నందు జెజిఎల్ 24423, కెఎన్‌ఎం 118, జెజిఎల్ 27356 కెఎన్‌ఎం 1638వంటి విత్తనాలు అందుబాటులో కలవని తెలిపారు.

## ముగిసిన 3 నెలల రేషన్ బియ్యం పంపిణీ

**-5996 కారులకు 153 మెట్రిక్ టన్నుల బియ్యం పంపిణీ**



చక్రియాల్‌లో రేషన్ సరుకులు అందచేస్తున్న రేషన్ డీలర్ దృశ్యం

**చౌటకూరు, జూన్ 28, ప్రభాతవార్త:**
మండలంలోని 17గ్రామాల్లోని చౌకధరలదుకాణల్లో ప్రజలకు అందచేస్తున్న 3 నెలల ఉచిత రేషన్‌బియ్యం పంపిణీ శనివారంతో ముగిసింది. 17 చౌకధరల దుకాణాల్లో 5996 కుటుంబాలు రేషన్ కార్డులు కలిగి ఉండగా రేషన్ కార్డులోని ప్రతి ఒక్కరికి 6కిలోల చొప్పున మూడు నెలలకు సరిపడా 153 మెట్రిక్‌టన్నుల సన్నబియ్యంను సరఫరా చేశారు. శనివారం వరకు రేషన్ బియ్యం అందుకోని రేషన్‌దారులు ఉంటే ఈ నెల 30వ తేదీ వరకు రేషన్ డీలర్ల వద్ద బియ్యం అందుకోవచ్చని రేషన్ డీలర్ల సంఘం మండల అధ్యక్షులు ఉపపరి దేవదాస్ మండల రేషన్ కార్డు దారులకు సూచించారు.

## పార్ట్‌టైమ్ లెక్చరర్ పోస్టులకు

### దరఖాస్తుల ఆహ్వానం

**సిర్గాపూర్, జూన్ 28, ప్రభాతవార్త:**
సిర్గాపూర్ గిరిజన సంక్షేమ పాఠశాల, కళాశాలలో పార్ట్‌టైమ్ లెక్చరర్‌ల నియామకానికి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ కె.ప్రియాంక పేర్కొన్నారు. ఆసక్తిగల అభ్యర్థులు జులై1న ఉదయం9గంటలకు జిన్నారం బాలుర కళాశాలకు హాజరై దరఖాస్తులు సమర్పించి డెమో, ఇంటర్వ్యూలకు హాజరుకావాలని సూచించారు. గణితం-1, పిజిటి గణితం-1, టిజిపి హిందీ-1, టిజిటి ఫిజికల్ సైన్స్-1 ఖాళీలు ఉన్నాయన్నారు. ఆయా సబ్జెక్టులలో పిజి, బిఎడ్ చేసిన అభ్యర్థులు దరఖాస్తులు చేసుకునేందుకు అర్హులన్నారు. అవకాశాన్ని అభ్యర్థులు సద్వినియోగం చేసుకోవాలని ప్రిన్సిపాల్ ప్రియాంక సూచించారు.

# గౌరవెల్లి ప్రాజెక్టు పూర్తికాకుండా కేసు వేసింది మీరు కాదా..!?

**-మెడికల్ కళాశాల లేకుండా పిజి అడ్మిషన్లు ఎలా సాధ్యం?**
**-నాలుగు లైన్ల రహదారి మంజూరు కాకముందే శంకుస్థాపన చేశారు**
**-హుస్నాబాద్ మాజీ శాసనసభ్యులు వొడితల సతీష్‌కుమార్**



మాట్లాడుతున్న మాజీ శాసనసభ్యులు వొడితల సతీష్‌కుమార్

**హుస్నాబాద్ రూరల్ ,జూన్ 28 , ప్రభాతవార్త:**
మెట్టప్రాంత రైతాంగానికి సాగునీటిని అందించాలనే ఉద్దేశంతో 2టిఎంసిల సామర్థ్యంగల గౌరవెల్లి ప్రాజెక్టును బిఆర్ఎస్ హయాంలో 8 టిఎంసిలకుపెంచి 90శాతం పనులుపూర్తై ట్రయల్ రన్ కూడా చేసిన ప్రాజెక్టుపై గ్రీన్‌ట్రిబ్యూనల్‌లో కేసు వేయించింది అధికార పార్టీ నాయకులు కాదా అని హుస్నాబాద్ మాజీ ఎమ్మెల్యే వొడితల సతీష్‌కుమార్ అన్నారు. శుక్రవారం హుస్నాబాద్ పట్టణ కేంద్రంలో పలు అభివృద్ధి కార్యక్రమాల శంకుస్థాపన ప్రారంభోత్సవాలకు హాజరైన మంత్రులు తుమ్మల నాగేశ్వర్‌రావు, దామోదర రాజనరసింహ, కోమటిరెడ్డి వెంకటరెడ్డి, పొన్నం ప్రభాకర్‌లు ఏర్పాటు చేసిన పబ్లిక్ మీటింగ్‌లో రాష్ట్ర ముఖ్యమంత్రి కెసిఆర్‌తో పాటు తనపై చేసిన ఆరోపణలను శనివారం తీవ్రంగా ఖండించారు. పట్టణకేంద్రంలోని బిఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ గడిచిన పదేళ్ల బిఆర్ఎస్ పాలనలో రాష్ట్ర ముఖ్యమంత్రి కెసిఆర్ ఆశీర్వాదంతోనే 100శాతం అభివృద్ధి పనులు పూర్తి చేశామని స్పష్టం చేశారు. తాను ఎమ్మెల్యేగా ఉన్నప్పుడు పూర్తిచేసిన మున్సిపల్, ఎసిపి కార్యాలయాలతో పాటు శుక్రవారం రోజున ప్రారంభించిన మాతాశిశు ఆసుపత్రి ఎవరి హయాంలో పూర్తయ్యాయో మంత్రులు తెలుసుకోవాలన్నారు. ఈ ప్రాంత శాసనసభ్యులుగా గెలిచిన నాటినుండి మంత్రి పొన్నం ప్రభాకర్ గడిచిన పద్దెనిమిది నెలలలో ఇప్పటివరకు ఏంపనులు చేశారో సమాధానం చెప్పాలన్నారు. ప్రాజెక్టుపనుల కోసం రూ.430కోట్లు మంజూరయ్యాయని గొప్పలు చెప్పే మీరు ఇప్పటివరకు పనులు ఎందుకు ప్రారంభించలేదన్నారు. రాజకీయంగా తనకు ఏం మాట్లాడాల్సిన అవసరం లేదని హుస్నాబాద్ పబ్లిక్ మీటింగ్‌లో మంత్రులు మాట్లాడినతీరుకే తాను స్పందించాల్సి వచ్చిందన్నారు. తమను ఏం చేశారు అని అడిగే ముందు మంత్రి పొన్నం ప్రభాకర్ ఈప్రాంతానికి 18నెలలుగా ఏంచేశారో చెప్పిన తర్వాతనే ప్రశ్నించాలన్నారు. గౌరవెల్లి ప్రాజెక్టుకు సంబంధించి సేకరించాల్సిన మరిన్ని భూములకు మంత్రి స్వయంగా వెళ్లి ఎకరాకు 30లక్షలు ఇస్తానని హామీ ఇచ్చి ఇప్పుడు 17లక్షలే ఇస్తాం, సంతకాలు పెట్టండి అని బెదిరింపులకు దిగడం వాస్తవంకాదా అని ప్రశ్నించారు. గౌరవెల్లి ప్రాజెక్టు పనులు ఆపేందుకు కేసు వేసిన వ్యక్తి ఇప్పుడు కాంగ్రెస్‌నాయకులను కలవ దానికి ఎందుకు ఇష్టపడడం లేదో చెప్పాలన్నారు. ఇక కాంగ్రెస్ అగ్ర నాయకురాలు ప్రియాంక గాంధీ, రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిలు ఇక్కడ మెడికల్ కళాశాల మంజూరు చేస్తామని ప్రజలను మోసం చేశారని, అది సరిపోదన్నట్టుగా కళాశాల లేకున్నా పిజి అడ్మిషన్లు 50 ఇస్తామనడం హాస్యస్పదంగా ఉందని ఎద్దేవాచేశారు. హుస్నాబాద్ నుండి కొత్తపల్లి వరకు నాలుగు లైన్ల రోడ్డు కావాలని బిఆర్ఎస్ హయాంలోనే ప్రతిపాదనలు పంపామని ఇప్పటికీ దానికిసంబంధించిన మంజూరురానేలేదని అయినా మంత్రులు ఎలా శంకుస్థాపనచేశారో అర్థం కావడం లేదన్నారు. హుస్నాబాద్ ఇంజినీరింగ్ కళాశాల మంత్రి తీసుకురావడం సంతోషకరమైన విషయమేనని కానీ విద్యార్థులకు ప్రస్తుత సంవత్సరం తన హయాంలో నిర్మించిన తీసుకొచ్చిన పాల్‌టెక్నిక్ కళాశాలలోనే అడ్మిషన్లు జరుగుతున్నాయనే విషయం మరిచిపోవద్దన్నారు. ప్రజలు కాంగ్రెస్ నాయకుల మాటలు నమ్మరని వచ్చే స్థానికసంస్థల ఎన్నికలలో చిత్తుగా ప్రజలే ఓడిస్తారన్నారు. సమావేశంలో పార్టీ పట్టణ అధ్యక్షులు అన్వర్‌పాషా, మండల అధ్యక్షులు గంగం మదన్ మోహన్‌రెడ్డి, సిద్దిపేట జిల్లా మాజీ వైస్ చైర్మెన్ రాజిరెడ్డి, హన్మకొండ మాజీ జడ్పి చైర్మెన్ సుధీర్‌కుమార్, నియోజకవర్గ అధికార ప్రతినిధులు చంద్రయ్య, మల్లిఖార్జున రెడ్డితోపాటు మాజీ ప్రజాప్రతినిధులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## అగ్నిప్రమాదాల నివారణకు ప్రత్యేక చర్యలు

**-జిల్లాలో మరో రెండు అగ్నిమాపక కేంద్రాలకు ప్రతిపాదనలు**
**-ప్రాంతీయ అగ్నిమాపక అధికారి సుధాకర్‌రావు వెల్లడి**



అగ్నిమాపకకేంద్రం తనిఖీచేసి, సిబ్బందికి సూచనలు ఇస్తున్న సుధాకర్‌రావు

**రామాయంపేట, జూన్ 28, ప్రభాతవార్త:**
అగ్నిప్రమాదాల నివారణకు నిరంతరాయంగా ప్రత్యేకచర్యలు తీసుకుంటున్నామని ప్రాంతీయ అగ్నిమాపక అధికారి సుధాకర్‌రావు స్పష్టం చేశారు. రామాయంపేట పట్టణంలో ఉన్న అగ్నిమాపక కేంద్రాన్ని శనివారం ఆయన ఆకస్మిక తనిఖీ చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ, ప్రజలకు నిరంతరం అగ్నిప్రమాదాల నివారణపై అవగాహన కల్పిస్తున్నామన్నారు. తమ జోన్ పరిధిలోని పంతొమ్మిది జిల్లాల్లో, అగ్నిప్రమాదాల నివారణ ప్రయత్నాలను మెరుగుపరచడానికి డెబ్బై పోలీస్ స్టేషన్లలో సిబ్బందికి క్రమం తప్పకుండా శిక్షణ ఇస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు. కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాల సహకారంతో ఆపదమిత్ర ద్వారా, గ్రామాల్లో ప్రమాదాలను నివారించడానికి యువతకు వాలంటీర్లుగా శిక్షణ ఇస్తున్నామని తెలిపారు. ఆపదమిత్ర ఎంపికల మొదటిదశ రాష్ట్రవ్యాప్తంగా పూర్తయిందని, చాలామంది యువకులకు శిక్షణ ఇచ్చి ధృవపత్రాలు అందజేశామని పేర్కొన్నారు. మెదక్ జిల్లాలో మరో రెండు అగ్నిమాపక కేంద్రాలను ఏర్పాటు చేయడానికి ప్రతిపాదనలు సిద్ధం చేసామని ఆయన వెల్లడించారు. ముఖ్యంగా, మెదక్, తూప్రాన్‌లలో కొత్త స్టేషన్ల కోసం ప్రతిపాదనలు ఇప్పటికే ప్రభుత్వానికి సమర్పించబడ్డాయన్నారు. త్వరలోనే ఆమోదంలభిస్తుందని ఆశిస్తున్నామన్నారు. ఈ సందర్భంగా ఆయన అగ్నిమాపక కేంద్రంలోని వివిధ పరికరాలను క్షుణ్ణంగా పరిశీలించి, రికార్డులను తనిఖీ చేశారు. అగ్నిమాపక యంత్రాలను కూడా పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. పాఠశాలలు, కళాశాలలు, ఆసుపత్రులు, వాణిజ్య సముదాయాలలో తరచుగా ప్రజలకు అవగాహన కార్యక్రమాలు పెంచాలని అగ్నిమాపక కేంద్రసిబ్బందికి సూచించారు. అగ్నిప్రమాద నివారణ కోసం ప్రజలకు అవగాహన కల్పించే ప్రాముఖ్యతను వారికి వివరించారు. కార్యక్రమంలో స్టేషన్ ఫైర్ ఆఫీసర్ వెంకటేష్, ఫైర్ సిబ్బంది నేరెళ్ల నరేష్, ప్రదీప్, సత్యం, బాబు, కె.శంకర్, కె.లింగం, కె.లక్ష్మారెడ్డితోపాటు పలువురు పాల్గొన్నారు.

## కాంగ్రెస్ సర్కారు పేదల సంక్షేమం అభివృద్ధియే ధ్యేయంగా ముందుకు సాగుతుంది

**-నియోజకవర్గ ఇన్‌చార్జి హరికృష్ణ**

**సిద్దిపేట రూరల్, జూన్ 28, ప్రభాతవార్త:**
సిఎం రేవంత్‌రెడ్డి నేతృత్వంలోని కాంగ్రెస్ సర్కారు పేదల సంక్షేమం, అభివృద్ధియే ధ్యేయంగా ముందుకు సాగుతుందని సిద్దిపేట నియోజకవర్గ కాంగ్రెస్‌పార్టీఇన్‌చార్జి పూజలహరికృష్ణ అన్నారు. సిద్దిపేటరూరల్, నారాయణరావుపేట మండలాలలోని పెద్దలింగారెడ్డి, నారాయణరావుపేట, గోపులాపూర్, జక్కాపూర్, గుర్రాలగొంది, మల్యాలగ్రామాలలో శనివారం ఇందిరమ్మ ఇల్లుమంజూరైన లబ్దిదారులతోకలిసి ఇంటినిర్మాణ పనులకు భూమిపూజ చేసి పనులుప్రారంభించారు. ఈసందర్భంగా ఆయనమాట్లాడుతూ ఇందిరమ్మ ఇల్లు మంజూరు కాలేదని ఎవరూ ఆందోళన చెందాల్సిన అవసరం లేదని జిల్లా ఇన్‌చార్జి మంత్రి వివేక్‌వెంకటస్వామితో మాట్లాడి రెండోవిడతలో అర్హులైన ప్రతి ఒక్కరికీ ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేయిస్తానని భరోసా ఇచ్చారు. పేదల సంక్షేమమే ధ్యేయంగా పనిచేస్తున్న కాంగ్రెస్ సర్కారుకు ప్రతి ఒక్కరూ అండగా నిలువాలన్నారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు పూజల గోపికృష్ణ, యాదగిరి, రాములు, అంజిరెడ్డి, మహిపాల్‌రెడ్డి, రామచంద్రం, కరుణాకర్, బాగన్న, సాంబమూర్తి, వనజ, రాజిరెడ్డి, బాల్‌రెడ్డి, రావు, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

## శ్రీరాం భక్తోత్సవానికి వేళైంది



ఆలయంలో కొలువుదీరిన రుక్మిణీసమేత పాండురంగస్వామి

**మర్కుక్, జూన్ 28, ప్రభాతవార్త:**
భక్తోత్సవానికి వేళైంది. భక్తుడిని భగవంతుడితో అనుసంధానం చేసేందుకు పాండురంగాశ్రమం అంగరంగ వైభవంగా ముస్తాబైంది. తారతమ్యాలు లేని సహపంక్తి భోజనాలు, తన్మయత్వంతో సాగే సామూహిక భజనలు... ఒక్కటేమిటి భక్తోత్సవం నిండా భక్తుల సందడే. ఉప్పొంగి ఆశీర్వదించేను మన రంగడే..
మర్కుక్ మండలంలోని అపర పండరీపురం పాండురంగాశ్రమం 94వ ఆషాఢి ఉత్సవాలకు సిద్ధమైంది. జులై 1 మంగళవారం యాదాద్రి జిల్లా చల్లూరు నుంచి జగదేవ్‌పూర్ మీదుగా భగవన్నామ శోభాయాత్రతో 94వ ఆషాఢ ఉత్సవాలు లాంఛనంగా ప్రారంభంకానున్నాయి. ఊరూరా భగవన్నామం చేస్తూ పెద్దసంఖ్యలో భక్తులు ఈ కార్యక్రమంలో పాల్గొననున్నారు. 2వ తేదీ బుధవారం శ్రీ యతివర భావానంద భారతీస్వామివారి గురుపాదుక పూజతో ఉత్సవాలు శాస్త్రోక్తంగా మొదలుకానున్నాయి. 3వ తేదీ గురువారం శ్రీసీతారామచంద్రస్వామి వారికి క్షీరాభిషేకం, పుష్పార్చన తదితర సేవలు ఉంటాయి. 4వతేదీ శుక్రవారం భవానీశంకరుల ఆలయంలో ప్రత్యేక పూజలు, శతరుద్రాభిషేకం, పుష్పార్చన, కుంకుమార్చనలు ఘనంగా జరుగుతాయి.

**5వ తేదీన త్రిరాత్రోత్సవాలు ప్రారంభం..**
జులై 5వ తేదీ శనివారం దశమి రోజున 94వ ఆషాఢ త్రిరాత్రోత్సవాలు అంగరంగ వైభవంగా ప్రారంభం కానున్నాయి. వేదోక్తంగా పుణ్యాహవచనం నిర్వహించిన అనంతరం అఖండ భగవన్నామ సంకీర్తనం మొదలవుతుంది. మూలమూర్తులైన శ్రీరుక్మిణీపాండురంగస్వామివారలకు క్షీరాభిషేకం, పుష్పార్చన, ప్రసాదవితరణ ఉంటుంది. పుష్పగిరి పీఠాధిపతి అభినవోద్దండ విద్యాశంకరభారతిస్వామి, గురు మదనానందసరస్వతీ పీఠాధీశ్వరులు మాధవానంద సరస్వతీస్వామి విచ్చేసి అనుగ్రహభాషణం చేస్తారు. శనివారం సాయంత్రం ఆధ్యాత్మిక ప్రవచనాలు ఉంటాయి. 6వతేదీ ఆదివారం తొలి ఏకాదశి సందర్భంగా స్వామివారికి విశేషపూజ, మహాహారతి, అఖండ భగవన్నామం, ఆ రోజు ఉదయం నుంచి మరుసటి రోజు ఉదయం వరకు సంగీత సాహిత్య కార్యక్రమాలు, వెంకట సింహాచలశాస్త్రిచే హరికథాకాలక్షేపం వైభవంగా జరుగుతాయి. ఏకాదశి రోజు నిరంతరం ఉపాహారం,తేనీరు భక్తులకు అందుబాటులో ఉంటాయని నిర్వాహకులు తెలిపారు. మిగతారోజుల్లో అన్నప్రసాదం ఉంటుందని వివరించారు. త్రిరాత్రోత్సవాల్లో చివరి రోజైన సోమవారం 7వ తేదీ ద్వాదశి మహా అన్నపూజ, అన్నప్రసాదవితరణ పెద్ద ఎత్తున జరుగుతుంది. ఈమహత్కార్యంలో భక్తులు పెద్దసంఖ్యలోపాల్గొని స్వామివారి కృపాకటాక్షాలు పొందాలని నిర్వాహకులు విన్నవించారు.

**చేటలతో వడ్డింపు... భక్తుల రాక భగవంతుడికి ఎరుక...**
ద్వాదశి రోజు జరిగే మహా అన్నదానికి భారీస్థాయి సాదమండపం పూర్తిస్థాయిలో అందుబాటులోకి వచ్చింది. ద్వాదశి అన్నదానం ఎన్నో ప్రత్యేకతల సమాహారం. తారతమ్యాలు లేకుండా అంతా సహపంక్తిలో కూర్చొని అన్నప్రసాదం స్వీకరిస్తారు.

## నూతన సిఐ, ఎస్ఐలను కలిసిన కాంగ్రెస్ నాయకులు

**కొండాపూర్, జూన్ 28, ప్రభాతవార్త:**
నూతన సిఐ,ఎస్ఐల బాధ్యతలు స్వీకరించిన సిఐ సుమన్‌కుమార్, ఎస్ఐ సోమేశ్వరిలను శనివారం ఆత్మకమిటీచైర్మన్ వై.ప్రభు,మాజీఎంపిటిసినరసింహారెడ్డిలు ఘనంగా సన్మానించారు. ఈసందర్భంగా వారుమాట్లాడుతూ మండలంలో శాంతిభద్రతలను కాపాడేందుకు కాంగ్రెస్‌పార్టీ తరపున అన్నిరకాలుగా పోలీసులకు సహకరిస్తామన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్‌నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# బిఆర్ఎస్ విధానాలే కాంగ్రెస్ ప్రభుత్వం అవలంబిస్తుంది

**-సిఐటి యూ జిల్లా ఉపాధ్యక్షులు వి.ప్రవీణ్‌కుమార్**



మాట్లాడుతున్న సిఐటియు నాయకులు ప్రవీణ్‌కుమార్

**సదాశివపేట, జూన్ 28, ప్రభాతవార్త:**
బిఆర్ఎస్ విధానాలానే కాంగ్రెస్ ప్రభుత్వం అవలంబిస్తుందని సిఐటియు జిల్లా ఉపాధ్యక్షుడు ప్రవీణ్‌కుమార్ అన్నారు. గ్రామపంచాయతీ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని, పెరిగినధరలకు అనుగుణంగా కనీస వేతనం 26 వేల రూపాయలు ఇవ్వాలని, మల్టీపర్పస్ విధానాన్ని రద్దు చేయాలని తదితర సమస్యలు పరిష్కరించాలని చలో హైదరాబాద్ కార్యక్రమం చేపడితే ముందస్తుగా ఇంటి వద్దకు పోలీసులు వచ్చి గ్రామపంచాయతీ నాయకులను అరెస్ట్‌చేయడం దుర్మార్గమన్నారు. ఇందిరమ్మ రాజ్యం అని పేరుచెప్పి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్‌ప్రభుత్వం గతం ఉన్న బిఆర్ఎస్ ప్రభుత్వ విధానాలనే అవలంబిస్తుందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల మేనిఫెస్టోలో పెట్టిన కార్మికుల గురించి అడిగితే పోలీసులను పెట్టి అరెస్ట్ చేయడం దుర్మార్గం అన్నారు. శాంతియుతంగా ధర్నా నిర్వహిస్తూ చలో హైదరాబాద్ వెళ్తామంటే ఇంటిదగ్గర ఉదయం 6గంటలకు వచ్చి అరెస్టుచేశారన్నారు. తక్షణమే గ్రామపంచాయతీ కార్మికుల సమస్యలను పరిష్కరించాలని రాష్ట్రప్రభుత్వం ఎన్నికల ముందు గ్రామపంచాయతీ కార్మికులను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తిస్తామని ఇచ్చినహామీని తక్షణమే అమలు చేయాలని ప్రవీణ్‌కుమార్ డిమాండ్‌చేశారు.

## వర్షాల కోసం 11 గ్రామాలకు పాదయాత్ర

**-11 గ్రామాల్లో ఆంజనేయస్వామికి జలాభిషేకం**



పాదయాత్రలో సంప్రదాయ భజనలు చేస్తున్న రైతులు

**సిర్గాపూర్, జూన్ 28, ప్రభాతవార్త:**
మండల పరిధిలోని వాసర్ గ్రామ రైతులు వర్షాల కోసం వరుణదేవుడికి కరుణించాని వేడుకుంటూ 11 గ్రామాలకు పాదయాత్రగా చేరుకుని గ్రామాల్లోని ఆంజనేయస్వామి ఆలయాల్లో జలాభిషేకం పూజా కార్యక్రమాలు నిర్వహించారు. మహిళా రైతులు నిండు కలశాలతో ఆలయానికి చేరుకుని ఆలయంలోని హనుమంతుడికి జలాభిషేకం చేసి వరుణుడు కరుణించేలా చూడాలని వేడుకున్నారు. పాదయాత్రలో వార్కారి సాంప్రదాయ భజనలు చేస్తూ 11 గ్రామాలకు పాదయాత్ర నిర్వహించారు. ఇదిలా ఉండగా మండలంలోని వాసర్, పోట్‌పల్లి, నాగన్‌పల్లి, గార్డెగావ్, ముబారక్‌పూర్, బొక్కగావ్, నల్లవాగు సిర్గాపూర్, చీమల్ పడ్, గౌడుగావ్ గ్రామాల రైతులు వరుణదేవుడిని స్మరిస్తూ భజనలు చేస్తూ ఆట పాటలతో వర్షాల కోసం పాదయాత్రలు చేశారు.

## అధికారులకు లంచాలు-నాయకులకు మామూళ్లు

**-కాలుష్యంతో సతమతమవుతున్న ప్రజలు**
**-ఎస్సి కార్పొరేషన్ మాజీ చైర్మన్ వై నరోత్తం**



సమావేశంలో మాట్లాడుతున్న ఎస్సికార్పొరేషన్ మాజీచైర్మన్ నరోత్తం

**జహీరాబాద్, జూన్ 28, ప్రభాతవార్త:**
జహీరాబాద్ సమీపంలోని అల్లానా కర్మాగారంలో ప్రజలకు ఒరుగుతున్నదేమి లేదని, అధికారులకు లంచాలు, నాయకులకు మామూళ్లు అందుతుండగా ప్రజలకుమాత్రం కాలుష్యం అంటగడుతోందని ఎస్సి కార్పొరేషన్ మాజీ చైర్మన వై.నరోత్తం ఆరోపించారు. శనివారం పట్టణంలోని తన కార్యాలయంలో నరోత్తం మాట్లాడుతూ ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో ఐడిఎ ద్వారా బుల్లెట్ కర్మాగారం అని చెప్పి పేద రైతుల నుంచి ఫుడ్ ప్రాసెస్ పేరుతో 150 ఎకరాల భూమిని కేటాయించి అల్లానా పశువధశాలను నిర్మించారని మండిపడ్డారు. కర్మాగారానికిపక్కనే ఉన్న వినోబా సేకరించిన భూదాన్‌భూములను కూడా ఆక్రమించుకున్నారని ఆవేదన వ్యక్తంచేశారు. పరిశ్రమ పర్యవేక్షణ బాధ్యతలను పశుసంవర్ధకశాఖ, కాలుష్యనియంత్రణ మండలి, ఎపిఈడిఎలకు అప్పగించినా సరైనవిధంగా పర్యవేక్షించిన ధాఖలాలు లేవన్నారు. పరిశ్రమలో రోజుకు 1వేయి పశువులను వధిస్తున్నారని, పరిశ్రమ చుట్టూ గ్రామాల్లో పశువుల సంఖ్య గణనీయంగా తగ్గిపోయిందని విచారం వ్యక్తం చేశారు. ఒక పశువును వధించాలంటే పశుసంవర్ధకశాఖ డాక్టర్ పశువులను పరిశీలించి ధృవీకరించాల్సి ఉంటుంది. వ్యర్థాలను నిబంధనల ప్రకారం వదలాల్సి ఉంటుంది. అయితే పరిశ్రమలో ఇద్దరు మాత్రమే విధులు నిర్వహిస్తూ ఉండగా రోజుకు వేయి వరకు పశువులను వధిస్తున్నారంటే డాక్టర్‌ల పనితీరుపై అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి. కాలుష్య జలాలను వర్షంకరుస్తున్న తరుణంలో వర్షపునీటిలోకి వదిలేస్తున్నారు. పరిశ్రమ పరిసర గ్రామాల్లోని భూగర్భజలాలు కాలుష్యమయం అయ్యాయి. పరిశ్రమలో పనిచేస్తున్న 2వేల మందిలో స్థానికులు కేవలం 2వందల మంది కూడా లేరంటే కర్మాగారంపై అధికారులు, పాలకుల పర్యవేక్షణ ఎలాగుందో ప్రత్యేకంగా చెప్పాల్సిన పనిలేదు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ శంకర్, నాయకులు జి.నర్సింలు, శికారిగోపాల్, చల్లా శ్రీనివాస్‌రెడ్డిలు తదితరులు ఉన్నారు.

## అన్నపూర్ణ క్యాంటీన్ పేరు మార్పు తగదు

**-నిరసన వ్యక్తం చేసిన మాజీ మంత్రి, కార్పొరేటర్**



నిరసన వ్యక్తం చేస్తున్న మాజీ మంత్రి, కార్పొరేటర్‌ల దృశ్యం

**రామచంద్రాపురం, జూన్ 28, ప్రభాతవార్త:**
పేదలకు 5రూపాయలకే అన్నంపెడుతున్న అన్నపూర్ణ క్యాంటీన్‌పేరును మార్చడం తగదని మాజీ మంత్రి తలసాని శ్రీనివాస్‌యాదవ్, భారతీనగర్ డివిజన్ కార్పొరేటర్ వెన్నవరం సింధూ ఆదర్శ్‌రెడ్డిలు తీవ్రంగా ఖండించారు. జిహెచ్ఎంసి ప్రధాన కార్యాలయం వద్ద మాజీ మంత్రి తలసాని శ్రీనివాస్‌యాదవ్ ఆధ్వర్యంలో జిహెచ్ఎంసి బిఆర్ఎస్ కార్పొరేటర్‌లతో కలిసి మాజీ మంత్రి నిరసన వ్యక్తం చేశారు. నిరసన కార్యక్రమంలో పాల్గొన్న భారతీనగర్ డివిజన్ కార్పొరేటర్ వెన్నవరం సింధూ ఆదర్శ్‌రెడ్డి మాట్లాడుతూ అన్నపూర్ణ క్యాంటీన్‌పేరును ఇందిరమ్మ క్యాంటీన్‌గా పేరుమార్చడం రాజకీయంకాదా అని ప్రశ్నించారు. క్యాంటీన్ పేరు మార్పును వెంటనే ప్రభుత్వం విరమించుకోవాలని యథావిధిగా అన్నపూర్ణ క్యాంటీన్‌గా ఉండేలా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా పేరు మార్పును విరమించుకోవాలని డిమాండ్ చేస్తూ జిహెచ్ఎంసి కమిషనర్ ఆర్‌వి కర్ణన్‌కు వినతి పత్రం అందచేశారు. కార్యక్రమంలో ముషీరాబాద్ ఎమ్మెల్యే ముఠా గోపాల్, కార్పొరేటర్లు పాల్గొన్నారు.



## సిసి రోడ్డు పనులను పరిశీలించిన కార్పొరేటర్

**రామచంద్రాపురం, జూన్ 28, ప్రభాతవార్త:**
రామచంద్రాపురం డివిజన్ పరిధిలోని అశోక్‌నగర్, జ్యోతినగర్ కాలనీల మధ్య 50లక్షల రూపాయలతో నిర్మిస్తున్న సిసి రోడ్డు పనులను శనివారం కార్పొరేటర్, జిహెచ్ఎంసి స్టాండింగ్ కమిటీ సభ్యురాలు బూరుగడ్డ పుష్పనగేష్ అధికారులు, కాలనీవాసులతోకలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ నాణ్యతతో కూడిన రోడ్డును నిర్మించాలని అధికారులు, కాంట్రాక్టర్‌లకు సూచించారు. రోడ్డుపై నీరు నిల్వఉండకుండా స్లాప్ సరిగ్గా వేయాలన్నారు. త్వరలోనే మజీద్ వద్ద నూతన డ్రైనేజీ పైప్‌లైన్ పనులను ప్రారంభిస్తామని కార్పొరేటర్ కాలనీవాసులకు హామీనిచ్చారు. కార్యక్రమంలో ఈఈ సురేష్, డిఈ నరేంద్ర, కాలనీ అధ్యక్షులు శేషరెడ్డి, మల్లయ్య, కలీమ్, మాజీ ఎఎంసి డైరెక్టర్ ప్రమోద్‌గౌడ్, చారి, పవన్, నిషాద్ సాంబ శివరావు, ధనసిరి ప్రకాష్ తదితరులు ఉన్నారు.